ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

ఆదివారం 22 సెప్టెంబరు 2024



ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి





వసూళ్లలో ఆ సారు దిట్ట..!

- అర్హతతో పనిలేకుండా రూ.లక్ష కొడితే ఏఈ పోస్టు
- కింది స్థాయి సిబ్బంది అకౌంట్లలోకి వసూళ్ల డబ్బు
- విచారణకు వచ్చిన రెవెన్యూ అధికారిపై తిట్ల పురాణం
- కింది స్థాయి సిబ్బంది పరిస్థితి ఆ దేవుడెరుగు..
- గత ప్రభుత్వంలో చక్రం తిప్పి.. ఇప్పుడూ కొనసాగుతూ..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఆయనో జిల్లా అధికారి.. మామూళ్లు.. లంచాలు వసూలు చేయడంలో ఆయన దిట్టగా పేరుగాంచారు. అర్హతతో సంబంధం లేకుండా లక్ష రూపాయలు లంచం ఇచ్చిన వాళ్లకు ఏఈ (ఎంఐసీ) పోస్టులు అమ్ముకుంటున్నాడు. నెలనెలా తనకు ఇచ్చే మామూళ్లను తన కింద పని చేసే అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల ఫోన్‌పే నెంబర్లకు వేయించుకుంటాడు. తనకు మామూళ్లు ఇవ్వని సిబ్బందిని తన ఇష్టానుసారం బదిలీలు చేసి.. బెదిరించి.. తన దారికి తెచ్చుకుంటాడు. ఈయన అక్రమాలపై అప్పట్లో జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తే విచారణకు వచ్చిన ఓ రెవెన్యూ డివిజనల్ అధికారిపై పత్రికల్లో రాయలేని విధంగా తిట్లపురాణం అందుకున్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారినే తిట్టాడంటే.. ఇక తన కింద పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది పరిస్థితి ఏంటో మనం ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

గత ప్రభుత్వంలో ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నాయకులతో.. సార్ నేను మీ వాడిని.. మీరు చెప్పినట్లే చేస్తా అని ఆ నాయకుల అక్రమాలకు వంత పాడి చక్రం తిప్పిన ఈయన... ఇప్పుడు ఈ ప్రభుత్వంలోనూ.. సార్ నేను మీ వాడిని.. మీరు చెప్పినట్లు చేస్తా.. అంటూ ఇంకా కొనసాగుతున్నారు.. అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా సాంబశివయ్య పనిచేస్తున్నారు. ఈయన బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఈయనపైన అనేక ఆరోపణలు ఉన్నాయి. సిబ్బందితో వ్యవహరించే తీరు సక్రమంగా లేదని పలువురు ఆరోపించారు. విధి నిర్వహణలోనూ సమర్థవంతంగా పనిచేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది నుంచి నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన బాగోతంలో మచ్చుకు కొన్ని..

- జిల్లా వ్యాప్తంగా ఒక్కో ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ కనీసం రూ.10 వేలు మామూళ్లు సమర్పించుకోవాలి. ఈ డబ్బును తన బ్యాంకు అకౌంటు లేదా ఫోన్‌పే నెంబరుకు వేయించుకోడు. వివిధ మండలాల్లో పనిచేసే అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల ఫోన్‌పే నెంబర్లకు వేయిస్తాడు. తర్వాత వాళ్ల దగ్గర నుంచి క్యాష్ తీసుకుంటాడు. ఈ లెక్కన ఈయన సంపాదన సుమారు రూ.లక్షలకుపైనే ఉంటుందని గృహనిర్మాణ శాఖ సిబ్బందే గుసగుసలాడుతున్నారు. ఈయనకు మామూళ్లు ఇవ్వని వాళ్లపై బదిలీ అస్త్రం ప్రయోగిస్తాడు. దీంతో చచ్చినట్లు అయనకు మామూళ్లు సమర్పించుకోవాల్సిందేనని పలువురు సిబ్బంది వాపోతున్నారు. (జిల్లాలో పనిచేస్తున్న పలువురు అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల ఫోన్‌పే డీటైల్స్ పరిశీలిస్తే.. వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఇంకా కొన్ని ఆయన కుటుంబ సభ్యుల అకౌంట్లలో వేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.)
- జిల్లాలో దాదాపు 40 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఒక్కో మండలానికి ఒక ఎంఐసీ (మండల ఇన్‌చార్జ్) ఉంటాడు. ఈ పోస్టుకు అర్హత బీటెక్, లేదా పాలిటెక్నిక్ చదవాలి. అయితే పలువురికి దొంగ సర్టిఫికెట్లతో ఎంఐసీ ఉద్యోగాలు ఇచ్చేశారు. గతంలో ఉన్న కలెక్టర్ ఈ సర్టిఫికెట్లపై విచారణ జరిపించి బోగస్ సర్టిఫికెట్లుగా గుర్తించి ఉద్యోగాలు ఇవ్వనీయకుండా నిలుపుదల చేయించారు. అయితే ప్రస్తుతం ఉన్న కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి అనర్హులకు, తప్పుడు సర్టిఫికెట్లు ఉన్న వారికే మళ్లీ ఉద్యోగాలు ఇప్పించాడు. తెలివిగా కలెక్టర్‌తో సంతకం పెట్టించి.. తాను ఇరుక్కోకుండా నియామక పత్రాలు ఇప్పించినట్లు గృహ నిర్మాణ శాఖలో కోడై కూస్తోంది. ఇలా ఇప్పటికే కొందరి వద్ద రూ.లక్ష వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంకా మరో ముగ్గురికి ఇచ్చేందుకు ఫైల్ సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇతని కాలంలో గృహనిర్మాణ శాఖలో జరిగిన అన్ని రకాల ఉద్యోగాల నియామకాలపై విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.
- గత ప్రభుత్వంలో పలువురు వైసీపీ నాయకులకు తలలో నాలుకలా మెలిగారనే ఆరోపణలు ఉన్నాయి. తనకు సంబంధం లేని విధుల్లోనూ జోక్యం చేసుకుని స్వయంగా మండల ఇన్‌చార్జ్‌లతో సంబంధాలు నెరిపాడనే ఆరోపణలు ఉన్నాయి. తన కింద పని చేసే ఈఈ, డీఈ స్థాయి అధికారులను కనీసం క్యాంపులకు వెళ్లకుండా చేసి డమ్మీలుగా చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా అధికారి క్యాంపుకెళ్లి క్షేత్రస్థాయిలో జరిగే అక్రమాలపై విచారిస్తే వెంటనే ఆ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యేలకు చెప్పి ఆ అధికారులను బండబూతులు తిట్టించే వాడని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతనే వైసీపీ నాయకులకు ఎలా దోచుకోవాలో? ఏం చేస్తే..డబ్బు మిగులుతుందో? చెప్పేవాడని సమాచారం. ఇందులో భాగంగానే గతంలో గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాలకు ఇసుక స్టాక్ పాయింట్ అవసరం లేకపోయినా అక్కడ పెట్టించాడు. ఆ ఇసుకను వైసీపీ నాయకులు కొందరు దర్జాగా అమ్ముకున్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో ఎన్నికల ఫలితాల రోజు కొందరు వైసీపీ నాయకులు 120 ట్రాక్టర్లు తరలించారు. ఆ విషయం అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇంతవరకు ఈ సంఘటనపై ఎటువంటి విచారణ, కేసు నమోదు కాలేదు. ఇతను దాదాపుగా ఎక్కడికి క్యాంపులు వెళ్లడు. ఎప్పుడూ జిల్లా కార్యాలంయలోనే ఉంటాడని సిబ్బంది పేర్కొంటుంటారు. అయినా నెలనెలా కారు బాడుగ పేరుతో రూ.40 వేలు తీసుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

నోరు తెరిస్తే.. బూతులే

ఆయన నోరు తెరిస్తే అన్నీ బూతులే మాట్లాడతాడని గృహనిర్మాణశాఖ సిబ్బంది హడలిపోతున్నారు. ఈయన కింద పనిచేసే చిన్న స్థాయి ఉద్యోగులనే కాకుండా పెద్ద స్థాయి అధికారులను కూడా అందరి ముందూ.. లం.. కొ.. అంటూ తిడతాడని సిబ్బంది వాపోతున్నారు. నోటికి ఎంత మాట వస్తే.. అంత మాట అనేస్తాడని సిబ్బంది పేర్కొంటున్నారు. గతంలో ఆయనపైన వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. ఓ ఆర్డీవో విచారణకు వచ్చారు. దీనిపైన ఈ అధికారి ఆర్డీవోను.. లం...కొ.. అంటూ. అందరి ముందు తిట్టాడు. ఈ విషయం ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ వీడియో ప్రస్తుతం సదరు ఆర్డీవోతో పాటు కలెక్టర్ దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై రెవెన్యూ ఉద్యోగులు రగిలిపోతున్నట్లు సమాచారం. ఈయన మీద గత ప్రభుత్వంలోనూ ఆరోపణలు వచ్చాయి. అయినా అతనిపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొందరు ఎమ్మెల్యేల అండ ఉండడంతోనే అతనిపై చర్యలు తీసుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఈయన మరింత రెచ్చిపోయి ఎవరికి చెప్పినా.. నాకు ఏం కాదు.. పత్రికల్లో వచ్చినా..ఎవరూ ఏం చేయలేరు. అంటూ బహిరంగంగానే చెప్పేవాడని తెలిసింది. విజయవాడలోని ఎండీ కార్యాలయంలో కొందరు ఉన్నతాధికారుల సహకారం ఉండడంతోనే ఇతను చెలరేగిపోయేవాడని పలువురు ఆరోపిస్తున్నారు. విజయవాడలోని కొందరు అధికారులకు నెలనెలా తిరుపతి లడ్డు.. కల్యాణం వడలు, డబ్బు పంపిస్తాడని ఆరోపణలు ఉన్నాయి. కాబట్టే.. ఇతను కూటమి ప్రభుత్వం వచ్చినా.. ఇంకా జిల్లాలోనే ఉన్నాడని పలువురు పేర్కొంటున్నారు. ఇతనిపైన ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. వాళ్లపైన కక్ష కట్టి వేధిస్తాడని ఆ శాఖలోని సిబ్బంది భయపడుతున్నారు.



ఎన్నికల ఫలితాల రోజు లక్కిరెడ్డిపల్లె ఇసుక స్టాకు పాయింటు నుంచి ఇసుకను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

కొసమెరుపు

ఇతని విద్యార్హత పాలిటెక్నిక్. దీంతో ఇతను పీడీ పోస్టులో ఉండటానికి అర్హుడు కాదు. బీటెక్ చదివిన వాళ్లే అర్హులు.. అయినా ఇప్పటికీ ఇన్‌చార్జ్ పీడీగానే విధుల్లో ఉండటం గమనార్హం. దీనిపైన వివరణ కోసం ఆయన ఫోన్ నెంబర్‌కు ఆంధ్రజ్యోతి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు.

సంక్షోభంలోనూ సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వం

- ప్రజల మధ్య పండుగలా వంద రోజుల పాలన
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, సెప్టెంబరు 21: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ప్రజలందరికీ సంక్షేమాన్ని అందిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం సంబేపల్లె మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో డీపీవో ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల మధ్య పండుగలా వంద రోజుల పాలన జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ ఒకేసారి వేయి రూపాయలు పెంచిన ఘనత ఈ ప్రభుత్వందే అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,437 టీచర్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తామని తెలిపారు. పేదవాడికి ఐదు రూపాయలకే అన్నం పెట్టేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. విజయవాడను వరద ముంచెత్తిన సమయంలో 74 సంవత్సరాల వయస్సు గల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 12 రోజుల పాటు బస్సులోనే ఉండి వరద బాధితులకు భోజనం, నీళ్ల మాత్రలు వంటి వసతులు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కోట్లాది మంది రైతులు ఉరి వేసుకునే విధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి రైతులను ఆదుకున్నామని చెప్పారు.

డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి ఐదు నుంచి పది లక్షల వరకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాయచోటి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందుకు ప్రజలందరూ సహకరించి ముందుకు రావాలన్నారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగస్వామి, హౌసింగ్ పీడీ శివయ్య, డీఆర్‌డీఏ పీడీసత్యనారాయణ, ఎంపీడీవో సునీల్ కుమార్, తహసీల్దార్ వెంకటేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, ఎంపీటీసీ రామరాజు, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, గోపాల్, టీడీపీ నాయకులు దుద్యాల రమేశ్‌రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ మల్లు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి, దుద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, గుట్టపల్లి వేణుగోపాల్‌నాయుడు, మండిపల్లి సిద్దారెడ్డి, సుబ్బరాజుయాదవ్, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కలికిరి, సెప్టెంబరు 21: కడప, అన్నమయ్య జిల్లాల్లో పలువురు మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి. సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీలో మేనేజరుగా పని చేస్తున్న జి.వి.పల్లవిని అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న పి.ఆర్.మనోహర్‌ను తొలగించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ ఉత్తర్వులతో ఉన్న పి.వి.రామలింగేశ్వర్‌ను తిరిగి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు అదనపు కమిషనరుగా బదిలీ చేశారు. అద్దంకి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టరుగా పని చేస్తున్న ఎం.శ్రీనివాసరెడ్డిని మైదుకూరు మున్సిపల్ కమిషనరుగా బదిలీ చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ కమలాపురం మున్సిపాలిటీ కమిషనరుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కె.వెంకటరామిరెడ్డిని జమ్మలమడుగు కమిషనరుగా నియమించారు. అక్కడున్న డీపీవో ఎస్.ప్రమోద్ కుమార్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్‌కు బదిలీ అయిన జి.రఘునాథరెడ్డి బదిలీ ఉత్తర్వులను రద్దు చేసి ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనరుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల బదిలీ

కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న గ్రేడ్-1, గ్రేడ్-2 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. కడ ప ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో గ్రేడ్-1 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప నిచేస్తున్న ఎస్.మొబీనా బేగంను గుంటూరు ఎస్సీ, ఎస్టీ నాలుగవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. రాజంపేట అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో గ్రేడ్-2 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న ఎల్. బాలాజీని కడప అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. అదే విధంగా చిత్తూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో గ్రేడ్- 2 అదనపు పీపీగా పనిచేస్తున్న జి.ఎస్.శైలజను మదనపల్లె ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశా రు. హోం శాఖ (కోర్టులు) ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్ కార్యాలయం పక్కన కాల్చివేసిన కాగితాలు



తహసీల్దార్ కార్యాలయ సమీపంలో పేపర్ల దహనం

- సబ్ కలెక్టర్ విచారణ
- చిత్తు కాగితాలు కాల్చినట్లు వెల్లడి

రాజంపేట, సెప్టెంబరు 21: రెండు నెలల కింద మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ ఫైళ్లు కాల్చివేయడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాజంపేట తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రెవెన్యూకు సంబంధించిన కొన్ని కాగితాలు కాల్చడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దుమారం రేగింది. కార్యాలయంలో చిత్తు కాగితాలు ఎక్కువై వాటిని శనివారం సాయంత్రం కాల్చివేసినట్లు రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. అయితే ఎన్నికలకు ముందు గత తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన అవినీతి భూబాగోతాల రెవెన్యూ రికార్డులను కాల్చివేసినట్లు దుమారం రేగింది. గత తహసీల్దార్ భూములకు సంబంధించిన రికార్డులను తారుమారు చేసి ఆన్‌లైన్‌లో పేర్లు మార్చారని, తప్పుడు రికార్డులను సృష్టించారని, వందల ఎకరాల భూములకు రికార్డులు మార్చారని గతంలో ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో ఆ సంఘటనలను ఉదహరిస్తూ శనివారం సాయంత్రం రికార్డులను కాల్చివేశారని సోషల్ మీడియాలో వచ్చింది. శనివారం సాయంత్రం తహసీల్దార్ రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో ఉన్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని దీనిపై విచారణ చేపట్టారు. రాజంపేట డీఎస్పీ సుధాకర్, ఇతర పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సబ్ కలెక్టర్ దీనిపై విచారణ చేస్తున్నారని, రెవెన్యూ రికార్డులు కావని, కేవలం చిత్తు కాగితాలు మాత్రమే కాల్చి వేసినట్లు సబ్ కలెక్టర్ చెప్పారని ఆయన తెలిపారు. ఎటువంటి రెవెన్యూ రికార్డులు కాల్చలేదని, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం పెట్టిన వారిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఏదేమైనా ఈ కాగితాల కాల్చివేతపై పూర్తి స్థాయి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

26 వరకు 'ఇది మంచి ప్రభుత్వం'

- అందరూ విజయవంతం చేయాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 21: జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో ఈనెల 26వ తేదీ వరకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, మండల సర్వేయర్‌లు, మండల స్పెషల్ ఆఫీసర్లకు కార్యక్రమం విజయవంతం చేయడానికి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా 100 రోజుల్లో ప్రభుత్వం ఏమి సాధించింది, ఏ విధంగా ముందుకు వెళుతోంది, ఆయా రంగాలలో ఆలోచనలు ఏమిటి అన్నవి ప్రజలతో పంచుకోవాలన్నారు. ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల వారు, ప్రజాప్రతినిధులు, మేధావులు, వివిధ వర్గాల వారితో మాట్లాడి వారి అలోచనలు కూడా నేరుగా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణ, డిప్యూటీ సీఈవో, డీపీవో, సర్వేశాఖ ఏడీ, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

కోదండరామాలయంలో త్వరలో అభివృద్ధి పనులు

- పరిశీలించిన టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 21: కోదండరామాలయంలో ఇంకా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలనే దానిపై టీటీడీ ఎస్ఈ మనోహరం, ఈఈ సుమతి, డీఈ నాగరాజు శనివారం పరిశీలించారు. నూతనంగా రామాలయం అభివృద్ధికి ఏ మేరకు ప్రణాళికలు ఏర్పాటు చేయాలి, ఏ మేరకు పనులు చేపట్టాలనే దానిపై టీటీడీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోదండరాముడి కల్యాణవేదిక వద్ద అభివృద్ధి పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎస్ఈ మనోహరం అన్నారు. రామాలయంలో తాగునీటి సమస్య ఉందని, సమస్యను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. ఏఈ అమర్‌నాథరెడ్డి, కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

ఫైళ్లు దహనమై నేటికి రెండు నెలలు

- సబ్ కలెక్టరేట్ భవనం స్వాధీనం...
- ప్రారంభం కాని మరమ్మతులు
- నిధుల కోసం అధికారుల ఎదురుచూపు
- 11 మండలాల ఫైళ్ల రికవరీ ఎప్పుడో..?



ఫైళ్ల దహనం జరిగిన సబ్ కలెక్టరేట్ భవనం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 21: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దహనం ఘటన జరిగి నేటికి రెండు నెలలు అవుతోంది. ఈ ఘటనపై సీఐడీ కేసు నమోదు కావడం.. పోలీసు ఉన్నతాధికారులు వచ్చి భవనంలో కాలిపోయిన వస్తువులు, ఫైళ్లు, ఫర్నీచర్ పరిశీలించడమే కాక, రెండుసార్లు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. అప్పటి నుంచి పోలీసుల ఆధీనంలోనే ఉన్న సబ్‌కలెక్టరేట్ పరిపాలన భవనం ఇటీవల సబ్‌కలెక్టర్‌కు స్వాధీనం చేశారు. ఈ పరిపాలన భవనం పునఃప్రారంభం కావాలంటే ప్రభుత్వం నిధులు మంజూరు కావాలి. రెండు నెలల నుంచి సబ్ కలెక్టరేట్ పరిపాలన అంతా పాత హెచ్‌ఎన్ఎస్ఎస్ భవనంలోని హాల్లోనే జరుగుతోంది. దీంతో పాటు ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డే, ఉన్నతాధికారుల సమావేశాలు కూడా ఈ భవనంలోనే జరుగుతున్నాయి.


మరమ్మతులకు మంజూరు కాని నిధులు

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో పరిపాలన కోసం కొత్త భవనం నిర్మించి, అందులో కార్పొరేట్ తరహాలో చాంబర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 10 వరకు వివిధ సెక్షన్లకు చాంబర్లు, వాటికి అనుసంధానంగా కంప్యూటర్లు, ఫైళ్లు భద్రపరిచేందుకు బీరువాలు, టేబుళ్లు, ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా సజావుగా జరిగిన పరిపాలన, జూలై 21వ తేదీ రాత్రి ఫైళ్ల దహనం ఘటన జరిగాక, పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. 10 రోజుల పాటు సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులను విచారించిన పోలీసులు వారిని విధుల్లోకి అనుమతించారు. దీంతో ఇదే ఆవరణలోని హెచ్ఎన్ఎస్ఎస్ భవనంలో సాధారణ పరిపాలన ప్రారంభించారు. 50 రోజులుగా ఈ భవనంలోనే పరిపాలన, సమావేశాలు, గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నారు. అందుబాటులో ఉన్న కంప్యూటర్లు, టేబుళ్లతోనే సర్దుకుని ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన భవనాన్ని రెవెన్యూ అధికారులు పోలీసుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు, ఎస్పీడీసీఎల్ అధికారులు వచ్చి కాలిపోయిన భవనం సామర్థ్యం, ఎలక్ట్రిక్ వైరింగ్, పెయింటింగ్, ఫర్నీచర్ మరమ్మతులకు ఎస్టిమేషన్‌లు వేసి సబ్‌కలెక్టర్‌కు నివేదించారు. దీనిపై సబ్‌కలెక్టర్ ఈ భవన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం ఎంత త్వరగా నిధులు విడుదల చేస్తే అంత వేగంగా సబ్ కలెక్టరేట్ పునఃప్రారంభం కావడంతో పాటు పరిపాలనలో వేగం పుంజుకోనుంది.

11 మండలాల్లో ఫైళ్ల రికవరీ ఎప్పుడో..?

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటనలో 2 వేలకు పైగా ముఖ్యమైన ఫైళ్లు దహనం కాగా 1500 ఫైళ్లు పాక్షికంగా దహనమైనట్లు సమాచారం. ఈ క్రమంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న ప్రాథమిక ఫైళ్లను అధికారులు రికవరీ చేసి, వాటి ఒరిజినల్స్‌ను సబ్‌కలెక్టరేట్ పంపాల్సి ఉంది. ఇందులో భాగంగా సబ్‌కలెక్టరేట్‌లోని 10 సెక్షన్లలో ఎస్టాబ్లిష్‌మెంట్, ల్యాండ్ కన్వర్షన్, క్రాకర్స్ లైసెన్స్, సివిల్ సప్లైస్, ఆర్వోఆర్ అప్పీల్, ప్రొటోకాల్, పేపర్ క్లిప్పింగ్స్, రిజిస్ట్రేషన్స్, వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్, ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీలు, పరిష్కారం ఫైళ్లు, అలీనేషన్, 22-ఏ, డాటెడ్ ల్యాండ్, ల్యాండ్ సీలింగ్, హౌసింగ్, ఆర్‌టీఐ, అసైన్‌మెంట్ ల్యాండ్, ఎలక్షన్ విభాగాలతో పాటు డివిజినల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఫైళ్ల రికవరీ చేయాల్సి ఉంది. ఇప్పటికే రెండు నెలలు గడిచిపోగా, వీటిని సిద్ధం చేయడంలో ఉన్నతాధికారులు నిర్దిష్ట ఆదేశాలు అందించాల్సి ఉంది. ఇదిలా ఉండగా మదనపల్లె ఆర్డీవోకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ గ్రూప్ సిమ్ నెంబర్ యాక్టివేషన్‌లో లేదు. ఈ సిమ్ యాక్టివేషన్ అయితే ప్రజాసమస్యలు, ఫిర్యాదులు నేరుగా సబ్‌కలెక్టర్‌కు అందించడంలో మార్గం సుగమం అవుతుంది.

బడ్జెట్ రిలీజ్ అవుతూనే పనులు ప్రారంభం



సబ్ కలెక్టరేట్ పరిపాలన భవనంలో కాలిపోయిన ఫైళ్లు, ఫర్నీచర్, బీరువాలు, పెయింటింగ్ తదితరాల మరమ్మతుల కోసం నివేదికలు పంపాము. బడ్జెట్ రిలీజ్ కాగానే మరమ్మతు పనులు వేగవంతం చేస్తాం.

- మేఘస్వరూప్, సబ్ కలెక్టర్, మదనపల్లె



తాత్కాలికంగా పరిపాలన అందిస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ భవనం

మూడు స్టాక్‌పాయింట్‌లలో ఇసుక



ఏటూరు రీచ్‌లో ఇసుక రవాణా వాహనాల వద్ద అధికారులు

కొండాపురం, సెప్టెంబరు 21: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం ద్వారా మండలంలోని మూడు స్టాక్‌పాయింట్‌లలో శనివారం ఇసుక రవాణా ప్రారంభమైంది. గురువారం నుంచి ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుకింగ్ సౌకర్యాన్ని కల్పించింది. అయితే రెండు రోజులుగా సర్వర్ పనిచేయక పోవడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. మండలంలోని ఏటూరు, పి.అనంతపురం, వెంకటాపురం ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక రావాణాను జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. జీపీఎస్ సిస్టమ్ ద్వారా పారదర్శకంగా ఇసుక రవాణా జరుగుతోందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకున్న వారికి క్యూలో లేకుండా ఎప్పటికప్పుడు లోడింగ్ చేసి పంపుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం రవాణా చార్జీలు కాకుండా లోడింగ్ చార్జీలకు టన్ను రూ. 340గా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆన్‌లైన్ విధానం ద్వారా ఎవరైనా మొబైల్ ద్వారా కూడా ఇసుకను బుక్ చేసుకోవచ్చు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర, ఏడీ శ్రీనివాసులు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాధా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు వాహనాలు ఢీ - ఒకరి మృతి

మరో ఆరుగురికి గాయాలు



జాఫర్ మృతదేహం

సంబేపల్లె, సెప్టెంబరు21: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి బావులకాడపల్లి క్రాస్ రోడ్డువద్ద శనివారం మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో జాఫర్ (66) మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు...

కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన భక్తులు కారులో కాణిపాకం వెళుతుండగా బావులకాడపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఏసర్, కారు, ఆటో ఒకదాని కొకటి ఢీకొనడంతో రాయచోటి పట్టణం కొత్తపల్లికి చెందిన టాటా ఏసర్‌లో ప్రయాణిన్న జాఫర్ మృతి చెందాడు. కారు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో కారులో ఉన్న ఆరుగురికి గాయాలైనట్లు తెలిపారు. ఎస్‌ఐ భక్తవత్సలం ప్రమాద విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి పోలీసు సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద కోసం ఆశపడితే రూ.1.64లక్షలు చోరీ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 21: కిందపడిన వంద నీదేనేమో తీసుకో అంటూ ఇద్దరు అపరిచితులు చెప్పి సుమారు 1.64లక్షలు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోరుమామిళ్ల ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే....

శుక్రవారం బి.కోడూరు మండలం వాసి చెముడూరి చిన్నగురయ్య స్టేట్‌బ్యాంకు నుంచి రూ.1.64 లక్షలు డబ్బు డ్రా చేసుకుని బైకులో వెళుతున్నాడు. ఇంతలో ఇద్దరు అపరిచితులు అతన్ని అనుసరిస్తూ సీతారాంపురం క్రాస్ రోడ్డు వద్ద వంద రూపాయల నోటు కింద వేసి మీడబ్బు కింద పడిందని చెప్పగా ఆ నోటు తనదే అని భావించి దానిని తీసుకునేందుకు డబ్బు కోసం బైకు దిగగానే అతని వద్ద కవరులో ఉన్న డబ్బు బ్యాగు తీసుకుని వారు పలాయనం చిత్తగించారు శుక్రవారం రాత్రి 11గంటల ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సికెదిన్నె, సెప్టెంబరు 21: ఊటుకూరు సర్కిల్ వద్ద శనివారం కడప సివిల్ సప్లయ్ విజిలెన్స్ సీఐ హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో మైదుకూరు నుంచి బెంగుళూరుకు వెళుతున్న బియ్యం లారీని పట్టుకుని సికెదిన్నె పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. అక్రమంగా బెంగుళూరుకు తరలిస్తున్న ఏపీ16టీఈ 3219 లారీని పట్టుకుని అందులో 494 బస్తాలు పీడీఎస్ రైస్ వాటి విలువ రూ.11,25,624 ఉంటుందని 80 బస్తాల పీడీఎస్ నూకలు వీటి విలువ రూ.1,06,521గా ఉంటుందని వీటిని విజిలెన్స్ అధికారులు సికెదిన్నె స్టేషన్‌లో అప్పగించారన్నారు. మైదుకూరుకు చెందిన లారీ ఓనర్ సుధీర్‌కుమార్, మాచనూరు సుబ్బరాయుడుకు చెందినవిగా తెలిపారు. సికెదిన్నె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

పోలీసులమని జాగ్రత్తలు చెప్పి చోరీ

ముద్దనూరు సెప్టెంబరు21: ' ఈ రోడ్డులో దొంగలు తిరుగుతుంటారు నగలు దోచుకుంటారు', జాగ్రత్తలు చెప్పి నగలు చోరీకి తెగబడ్డారు. సీఐ దస్తగిరి తెలిపిన మేరకు వివరాల్లోకెళితే.... బొందలకుంట వాసి పుల్లయ్య అతని భార్యతో కలిసి పని నిమిత్తం కడపకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ముద్దనూరు నుంచి ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళుతుండగా మార్గ మధ్యలో నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చి వాహనాన్ని ఆపారు. మేము పోలీసులము ఇక్కడ దొంగతనాలు జరుగుతున్నాయి. బంగారు నగలు జాగ్రత్తగా పెట్టుకోండి అన్నారు. వంటిపై నున్న బంగారు నగలు వారికి ఇవ్వగా పేపర్లో పెట్టి ఇచ్చారు. కొద్ది దూరం వెళ్లి చూడగా పేపర్లో బంగారు నగలు లేవు, గులక రాళ్లు ఉన్నాయి. వంటిపై ఉన్న బంగారు తాళి బొట్టు, ఉంగరాలు చోరీ అయినట్లు, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యూసీఐఎల్‌లో గ్రాండ్ హిందీ డే

వేముల, సెప్టెంబరు 21: తుమ్మలపల్లె యూనిట్‌లో గ్రాండ్ హిందీ డే సెలబ్రేషన్స్ నిర్వహించినట్లు యూసీఐఎల్ అధికారులు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో యూసీఐఎల్ అధికారులు మాట్లాడుతూ 14న ప్రారంభించి హిందీ ఎస్ఏ రైటింగ్, నోటింగ్, డ్రాఫ్టింగ్, రాత పద్యాలు, ప్రసంగం, లేఖ రాయడం, అనువాదం తదితర పోటీలు నిర్వహించారు. మైన్స్, మిల్, అకౌంట్స్, పర్చేజ్, స్టోర్, హెచ్‌పీయూ సీఆర్‌డీ, అడ్మినిస్ట్రేషన్, ఎస్టేట్, ఎలక్ట్రికల్ తదితర వివిధ విభాగాల కోసం యూసీఐఎల్ నాలుగు బృందాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఆరోగ్యం, సాహిత్యానికి సంబంధించిన ప్రశ్నల ద్వారా పాల్గొనేవారు ప్రోత్సహించబడ్డారన్నారు. హిందీ భాషలో పాల్గొన్న వారందరికీ డిప్యూటీ జనరల్ మేనేజర్ (మిల్) సుమన్ సర్కార్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు సోంజోయ్ ఛటర్జీ, లక్ష్మీ రంగయ్య, విపిన్ కుమార్‌శర్మ, డాక్టర్ పీకె తామ్రాకర్, ధరమ్‌వీర్‌యాదవ్, బీనా, హిమాన్షుతివారి, కుమార స్వామి, శ్రీహర్ష, సతీష్‌బిత్రా, వెంకటనరేంద్ర, సజీవ్ కుమార్‌శర్మ, అమ్జద్ అలీ, శివప్రసాద్, మేత్యానంద్, పికె నాయక్, బి. తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తు గడువు పొడిగింపు

- అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు21: ఓపెన్ స్కూల్ ప్రవేశాల కోసం 2024-25 విద్యా సంవత్సరం దరఖాస్తు చేసుకునేందుకు 28వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులు తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 29, 30వ తేదీల్లో ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. అన్నమయ్య జిల్లాలో డ్రాపౌట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరగలిగే వయసు ఉన్న 754 మంది విద్యార్థుల డ్రాపౌట్స్ వివరాలు ఆయా మండలాల్లో పాఠశాలల వారీ ఎంఈఓల వద్ద ఉన్నాయని, అటువంటి విద్యార్థులందరినీ మండల కోఆర్డినేటర్‌లు తమ తమ ఓపెన్ స్కూల్స్ సెంటర్స్‌లో చేర్పుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌లు ఈ విషయాన్ని వారి పరిధిలో విస్తృతంగా ప్రచారం చేసి డ్రాపౌట్స్ విద్యార్థులు అందరూ ప్రవేశాలు పొందేలా ప్రయత్నించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

బార్ అసోసియేషన్‌ను సందర్శించిన హైకోర్టు జస్టిస్



హైకోర్టు జస్టిస్ రామకృష్ణప్రసాద్‌కు సమస్యలను వివరిస్తున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. గుర్రప్పనాయుడు, చిత్రంలో జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తదితరులు

కడప(రూరల్) సెప్టెంబర్ 21: రాష్ట్ర హైకోర్టు జస్టిస్, జిల్లా పోర్ట్‌పోలియో జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్ శనివారం కడప బార్‌అసోసియేషన్‌ను సందర్శించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి. గుర్రప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి కెనడి, ఉపాధ్యక్షులు సి. చంద్రమోహన్ తదితరులు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న సమస్యలను జస్టిస్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కోర్టు సముదాయంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను భర్తీ చేయాలని, 2019లో డెమాలిష్ చేసిన స్థలంలో నూతన కోర్టుల సముదాయాన్ని నిర్మించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ వెంట జిల్లా ప్రధాన జడ్జి జి. శ్రీదేవి, ఆయాకోర్టుల జడ్జిలు, న్యాయవాదులు ఉన్నారు.

అలంకారప్రాయం.. ఇండోర్ స్టేడియం



- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఐదేళ్లుగా ఏర్పాటు కాని కమిటీ
- పోటీలు నిర్వహించలేని దుస్థితి
- అధికారుల తీరుతో ఇబ్బంది
- ఆధునికీకరణకు నోచుకోని స్టేడియం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21: పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. ఇందులో పట్టణ క్రీడాకారులు ఆహ్లాదకరంగా ఆడుతూ ఆటల్లో పటిమను పెంచుకునేవారు. అయితే అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పోటీలు సైతం నిర్వహించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మున్సిపల్ ఇండోర్‌స్టేడియం తర్వాత పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ఇండోర్ స్టేడియాలు క్రీడాకారులతో సందడిగా ఉంటే మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులు లేకపోవడం, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది.

క్రేజీ క్రీడల్లో బ్యాడ్మింటన్ ఒకటి. బ్యాడ్మింటన్ పట్ల యువతను ప్రోత్సహించడానికి అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. 2012లోనే రూ.67 లక్షల మున్సిపల్ నిధులతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. తర్వాత స్టేడియంలో వివిధ అభివృద్ధి పనుల కోసం మరో రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇందులో సభ్యత్వానికి నెలకు రూ. 300 చెల్లించాల్సి ఉంది. మొదట్లో స్టేడియంలో 60 మంది సభ్యులు చేరారు. అయితే సగం మంది డబ్బు చెల్లించిన దాఖలాలు లేవు. అయితే స్టేడియంలో ఉదయం పూట సభ్యులు ఆడుకుంటే సాయంత్రం క్రీడాకారులు ఆడుకునే అవకాశం కల్పించారు. మొదట్లో నిర్వహణ బాగా సాగడంతో క్రీడాకారులు ఆడుకోవడానికి వచ్చేవారు. అంతేకాకుండా బయటి నుంచి వచ్చే క్రీడా కారులతో పోటీలు నిర్వహించేవారు. తర్వాత మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడుతూ రాసాగింది. కరోనా నుంచి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లగా స్టేడియం నిర్వహణకు కనీసం కమిటీని కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. సభ్యుల ఫీజు రాకపోయినా మున్సిపాలిటీ మాత్రం నెల నెలా కరెం టు బిల్లు, బాయిస్ వేతనం, క్లీనింగ్ కోసం ఖర్చు చేస్తోంది.



పాతబడిన సింథటిక్ కోర్టు

కొరవడిన పర్యవేక్షణ

ఇండోర్ స్టేడియాన్ని తీర్చిదిద్దడంలో అధికారులు వెనుకంజ వేశారని చెప్పవచ్చు. సభ్యులను చేర్చుకున్న వారు తర్వాత కాలంలో సభ్యుల చేరికపై దృష్టిసారించలేదని చెప్పవచ్చు. అంతేకాకుండా ఉన్న సభ్యుల నుంచి నెల నెలా ఫీజును వసూలు చేయలేకపోయారు. ఫలితంగా స్టేడియంలో అత్యంత ఖరీదుతో చేపట్టిన ఉడెన్ ఫ్లోర్ దెబ్బతినింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మున్సిపల్ స్టేడియం తర్వాత పట్టణంలో ఏర్పాటైన ప్రైవేటు స్టేడియాలు క్రీడాకారులతో సందడి జరుగుతున్నాయి. మరో విశేషమేమిటంటే చాలా మంది మున్సి పల్ సిబ్బంది సైతం ప్రైవేటు స్టేడియాల్లో సభ్యులు గా చేరారనే ఆరోపణలున్నాయి. మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులు లేకపోవడం, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది.



● అనుమతి లేకుండా శిక్షణ

క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలంటే మున్సిపాలిటీ అనుమతి అవసరం. ప్రస్తుతం స్టేడియంలో అనుమతి లేకుండానే క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నెలకు సుమారు రూ.800 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టేడియం నుంచి తగిన ఆదాయం రాకపోవడంతో మున్సిపల్ అధికారులు కూడా స్టేడియం నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాదాపు పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన సింథటిక్ మ్యాట్‌పైనే ఆడుకుంటున్నారు. మ్యాట్ల పక్కన ఉన్న ఉడెన్‌ఫ్లోర్ దెబ్బతిన్నా పట్టించుకునేవారు లేకపోవడంతో క్రీడాకారులు సర్దుకు పోతున్నారు. ఎప్పుడో వేసిన రంగులు వెలిసినా పట్టించుకోవడంలేదు. స్టేడియాన్ని ఆధునికీకరించాలన్న ధ్యాస కూడా అధికారులకు లేకుండాపోయింది.

అధికారుల ఆదేశాలను పట్టించుకోని వైనం

మున్సిపల్ పాఠశాల వ్యాయామ ఉపాధాయుడిని అధికారులు ఇండోర్ స్టేడియంలో కోచ్‌గా నియమించారు. వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులందరినీ విద్యాశాఖ పరిధిలోకి తేవడంతో కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆ వ్యాయామ ఉపాధ్యాయుడు మున్సిపల్ అధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదని సమాచారం. ఆ వ్యాయామ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అధికారులు స్టేడియంను ఆధునికీకరించి శిక్షణ ఇవ్వాలని, పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా శిక్షణ పొందే అవకాశం కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

స్టేడియం కమిటీ ఏర్పాటుకు చర్యలు

ఇండోర్ స్టేడియం కమిటీ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారు. తాను కోచ్‌గా వచ్చిన తర్వాత పైకప్పు కారకుండా రిపేర్లు చేయించా. స్టేడియం సభ్యులు కొందరు నెల నెలా డబ్బులు చెల్లించలేదు. చాలా కాలం నుంచి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడంలేదు. క్రీడాకారులు షటిల్ బ్యాట్ ప్రాక్టీసు చేసుకోవడానికి మిషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపితే కొందరు అధికారులు అడ్డుకున్నారు. కోచింగ్‌కు కొద్దిమంది క్రీడాకారులే వస్తున్నారు.

రాఘవ, బ్యాడ్మింటన్ కోచ్



రంగులు వెలసిన గోడలు

దారి దోపిడీ ముఠా గుట్టు రట్టు

ఒకటిన్నర కిలో గంజాయి స్వాధీనం ● ఎనిమిది మంది యువకుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

కమలాపురం రూరల్, సెప్టెంబరు 21: దారికాచి దోపిడీ చేస్తున్న ముఠా గుట్టును కమలాపురం పోలీసులు రట్టు చేశారని కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ముఖ్యమైన రహదారుల్లో ప్రయాణించే లారీలను ఆపి డ్రైవర్లను కొట్టి కత్తులతో బెదిరించి డబ్బు, సెల్‌ఫోన్లను లాక్కునిపోయే గ్యాంగ్‌ను ఎస్పీ ఆదేశాల మేరకు స్వీయ పర్యవేక్షణలో పట్టుకున్నారని తెలిపారు. గంగవరం ఆర్చి వద్ద వినోద్‌కుమార్, సాయి ప్రశాంత్, ఉదయ్‌కుమార్ ఉన్నట్లు అందిన సమాచారంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కడప సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి, కమలాపురం సీఐ రోషన్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, వల్లూరు ఎస్‌ఐ సంజీవరాయుడు తమ సిబ్బంది శనివారం ఉదయం 9గంటలకు వారిని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. చాపాడు మండలం పల్లవోలు వాసి వినోద్‌కుమార్ చెడు వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించడం కోసం చాపాడు మండలంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో చదివే గుజ్జుల సాయి ప్రశాంత్, ఉదయ్‌కిరణ్, మురళీధర్, ఆదికేశవరెడ్డి, వెంకటసుబ్బయ్య, నరహరితో పరిచయం చేసుకున్నాడు. వీరికి గంజాయి అలవాటు చేసి వారితో కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడి రాత్రి సమయంలో జిల్లాలోని పలు మండలాల్లో భారీ దోపిడీ చేసినట్లు నిర్ధారణ అయిందన్నారు. లారీ డ్రైవర్లను కత్తులు చూపిస్తూ చంపుతామని బెదిరిస్తూ వారి వద్ద నుంచి డబ్బు, సెల్‌ఫోన్లు లాక్కుని వెళ్లేవారని తెలిపారు. ఈ నెల 2న చాపాడు పోలీసు స్టేషన్‌పరిధిలో సెల్‌ఫోను రూ.9వేలు, 15న ఒంటిమిట్ట స్టేషన్ పరిధిలో ఒక మొబైల్ ఫోను రూ.15వేలు దోచుకున్నట్లు తెలిపారు. 18న వల్లూరు పరిధిలో ఒక మొబైల్ రూ.3500 దోచుకున్నారు. 20న ముద్దనూరు పోలీసుస్టేషన్ పరిధిలో రెండు మొబైల్‌ఫోన్లు 10 గ్రాముల ఉంగరం, రూ.14800 డబ్బు దోచుకున్నారు. అదే రోజు రాత్రి ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్ పరిధిలో రూ.7500 నగదు సెల్‌ఫోను, కమలాపురం పోలీసుస్టేషన్ పరిధిలో రూ.4500 నగదు దోచుకున్నట్లు విచారణలో తేలింది. కాగా రూ.14800 డబ్బు, 8 సెల్ ఫోన్లు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పనిచేసిన సీఐ, ఎస్‌ఐ పోలీసు సిబ్బందికి రివార్డు ఇచ్చేందుకు ఎస్పీకి రెఫర్ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలమల్ల పోలీసుపై వేటు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: కలమల్ల పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శివను ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మూడేళ్లగా శివ ఇక్కడ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. ఇటీవల ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని దొరసానిపల్లెలో పోలీసులు దాడులు చేసి 17మందిని జూదరులను అరెస్టు చేశారు. అందులో కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. ఈ విషయంపై సీరియస్ అయిన ఉన్నతాధికారులు శనివారం అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు.

ఏడుగురు జూదర్ల అరెస్టు

- రూ.75,800 నగదు, కారు, బైక్, రెండు స్కూటీలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం

కడప (క్రైం), సెప్టెంబరు 21: చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో జూదమాడుతున్న ఏడు గురిని అరెస్టు చేసినట్లు సీఐ తేజమూర్తి తెలిపారు. పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు కడప సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ పర్యవేక్షణలో శ్రీక్రిష్ణ ఇన్ లాడ్జి పక్కన పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.75,800 నగదు, కారు, మోటారు సైకిల్, రెండు స్కూటీలు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

15 మంది జూదరుల అరెస్ట్...

రాజంపేట టౌన్, సెప్టెంబరు 21: బోయనపల్లె అరుంధతీవాడ సమీపంలో పేకాడుతున్న 15 మంది జూదరులను మన్నూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రామాంజనేయుడు తెలిపారు. ముళ్లపొదల్లో పేకాడుతున్న సమాచారం అందడంతో సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు చేశారు. వారి నుంచి రూ.50 వేల పైచిలుకు మొత్తాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సీఐ తెలిపారు. సిబ్బంది అంజిరెడ్డి, రవికుమార్, చంద్రమోహన్ నాయుడు, చంద్ర, బాబు, ప్రసాద్, ఆంజనేయులు, రమణ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి

ఖాజీపేట, సెప్టెంబరు 21: ప్రమాదవశాత్తు కిందపడి రావులపల్లె వాసి గంగవరం శ్రీనివాసులరెడ్డి (72) మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు.... శ్రీనివాసులరెడ్డి పని నిమిత్తం పొలం దగ్గరకు వెళ్లి తిరిగి వస్తుండగా నీటిలో పడి శుక్రవారం మృతిచెందాడు. అయితే కుటుంబీకులు ఎవరూ లేకపోవడంతో ఎక్కడికైనా వెళ్లాడేమోనని బంధువులు అనుకున్నారు. చివరకు అనుమానం వచ్చి పొలం వద్ద నీటిలో మృతదేహం తేలియాడుతూ కన్పించడంతో శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

పెద్దనపాడులో ఘర్షణ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: పెద్దనపాడులో ఘర్షణ జరిగినట్లు సమాచారం. గ్రామానికి చెందిన శిరిగిరెడ్డి శివరామిరెడ్డి టీడీపీకి చెందిన కే.శ్రీనివాసరెడ్డిపై దాడిచేసినట్లు సమాచారం. ఈ దాడిలో శ్రీనివాసరెడ్డికి గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాత కక్షలుకూడా ఈ ఘర్షణకు కారణాలుగా చెబుతున్నారు.

రెండు లారీలు ఢీ- డ్రైవరుకు గాయాలు

కడప (క్రైం), సెప్టెంబరు 21: దేవునికడప బైపాస్‌రోడ్డులో శనివారం రాత్రి రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓ లారీ డ్రైవరు గాయపడ్డాడు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో చిన్నచౌకు సీఐ తేజమూర్తి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. డ్రైవరును రిమ్స్‌కు తరలించారు.

ఆర్టీపీపీలో చోరీ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: ఆర్టీపీపీలోని వీపీటెక్ కంపెనీలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు సామాన్లు, ఇనుప వస్తువులు చోరీ చేసినట్లు కలమల్ల పోలీసులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2,42,000 ఉంటుందన్నారు. కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా చోరీకి గురైన సామగ్రి దొరికినట్లు సమాచారం. ఈవిషయంపై కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

దసరా సెలవులను రివైజ్ చేయాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21: దసరా సెలవులను రివైజ్ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్, చెంగల్ రెడ్డి, ఉమాకాంత్ డిమాండ్ చేశారు. మహాలయ అమావాస్య విశిష్టత గుర్తించి దసరా సెలవులను అక్టోబరు 3 నుంచి ప్రకటించాలని కోరారు. గతంలో మాదిరి దసరా సెలవులను పునరుద్దరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం కేసు నమోదు

సుండుపల్లె, సెప్టెంబరు21: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పించా ప్రాజెక్టు దిగువ భాగం నుంచి తరలిస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

వీరబల్లి, సెప్టెంబరు21: వనంకాడపల్లి హరిజనవాడకు చెందిన భూపాల్‌పై అదే గ్రామానికి చెందిన రమణ, నాగేంద్ర శుక్రవారం కొడవలితో దాడి చేయడంతో తలకు గాయమైంది. పాతకక్షలతో భూపాల్‌పై వారిద్దరూ దాడి చేయడంతో ఈ ఘర్షణ జరిగిదని ఎస్‌ఐ మోహన్ నాయక్ తెలిపారు. భూపాల్‌ను చికిత్స కోసం రాయచోటికి తరలించగా శస్త్ర చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తీసుకెళుతున్న మద్యం బాటిళ్లను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. తమిళనాడు రాష్ట్రం 90 హాఫ్ బాటిల్స్, 26 ఫుల్ బాటిల్స్ ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఆక్రమణదారుల నుంచి చెరువును కాపాడండి



మంత్రి రామానాయుడును కలిసిన మండల టీడీపీ నేతలు

చిట్వేలి, సెప్టెంబరు 21 : తిమ్మయ్యగారి పల్లె చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడాలని రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి రామానాయుడును కోరినట్లు తిమ్మయ్య గారి పల్లె టీడీపీ నేత కాటూరి నరసింహులు తెలిపారు. శనివారం విజయవాడలో మంత్రిని కలిసి తిమ్మయ్యగారి పల్లె 70 ఎకరాల చెరువు ఆక్రమణకు గురవుతోందని వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలు రామాంజనేయులు, లారీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

సంబేపల్లె, సెప్టెంబరు21: ఖరీఫ్ సీజన్‌లో రాయచోటి నియోజకవర్గ పరిధిలో సాగు చేసిన వేరుశనగ పైరు పూర్తిగా ఎండిపోయిందని అన్నమయ్య జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి తెలిపారు. శనివారం మోటకట్ల గ్రామంలో రైతులతో కలిసి ఎండిన వేరుశనగ పైరును పరిశీలించారు. గత ఏడాది జిల్లాలోని 18 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. ఈ సారి వ్యవసాయ అధికారులు అన్ని మండలాల్లో దెబ్బతిన్న పైర్లను పరిశీలించి కరువు మండలాలుగా గుర్తించాలన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండెం రామకృష్ణయ్య



రాయచోటిటౌన్, సెప్టెంబరు 21: మాల మహానాడు అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎగువ అబ్బవరం వాండ్ల పల్లికి చెందిన మండెం రామకృష్ణయ్య ఎన్నిక య్యారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన మాలమహానాడు కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యామల సుదర్శన్ నియామక పత్రం అందజేశారు. మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య, రాయలసీమ కన్వీనర్ యామల చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 21 : మండల పరిధిలోని గంగపేరూరు చెరువులోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు కంచెలను తొలగించి, గుంతలు తవ్వారు. చెరువు భూములను ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని, రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరమణ, వీఆర్వో లిఖిత, సర్వేయర్ విన్ని, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే జలమయం



శెట్టిగుంట గ్రామంలో వీధుల్లో నిలచిన వర్షపు నీరు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 21: మండలంలో శనివారం కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో శెట్టిగుంట, మాధవరం పోడు, ఉప్పరపల్లె, లక్ష్మీగారిపల్లె, రాఘవరాజపురం, రైల్వేకోడూరు పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. పాదచారులు ఇక్కట్లు పడ్డారు. మండలంలోని పలు పంచాయతీల్లో రోడ్లు దెబ్బతినడంతో గుంతలు ఏర్పడ్డాయని, వర్షం కురిసినప్పుడు ఆ గుంతల్లోకి నీరు చేరుతోందని ప్రజలు వాపోయారు.

భూ ఆక్రమణలపై విచారణ చేయాలి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 21 : మండలం లో వైసీపీ హయాంలో జరిగిన అక్రమ భూదందాలపై విచారణ చేయాలని కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య కోరారు. గతంలో కొందరు తహసీల్దారు సంతకాన్ని ఫోర్జరీ నకిలీ పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఈ వ్యవ హారంపై ఒక ప్రత్యేక అధికారిని నియమించి నిష్పక్ష పాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టరు ను కోరారు. మండలంలో చేనేత కార్మికుడు పాల సుబ్బారావు ఆత్మహత్యకు నకిలీ పట్టాలే కారణమని, దీనిపై విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ఆయన కోరారు.

జగనన్న కాలనీల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..!



నూలివీడులో పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ

- నిర్మాణ వ్యయం తడిసి.. మోపెడు
- మౌలిక సదుపాయాలు కరువు
- ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారుల నిరాసక్తత

గాలివీడు, సెప్టెంబరు 21: ఇంటి నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. గత ప్రభుత్వ హయాంలో 1.7 లక్షల రూపాయలతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి అప్పుల పాలయ్యామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది.

మండలంలోని అరవీడు పంచాయతీ మలసానివాండ్లపల్లెలో 71, ఎగువగొట్టివీడు 3, గాలివీడుపంచాయతీ ప్రాజెక్టు సమీపంలో 84, బలిజపల్లెలో 24, అరవీడువాండ్లపల్లె 48, గాలివీడు సమీపంలో 87, గరుగుపల్లి పంచాయతీ కస్పాలో 6 , గుండ్ల చెరువు పంచాయతీలో 4, కొర్లకుంట పంచాయతీ చావిడిపల్లిలో 29 , నూలివీడు పంచాయతీలోని ఆవులవాండ్లపల్లె సమీపంలో 27 , పంది కుంట పంచాయతీలో 7, పూలుకుంట పంచాయతీలో 18, తలముడిపి 3, తూముకుంటలో 6, వెలిగల్లులో 3 ఇళ్లు, జగనన్న కాలనీల్లో 124 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 126 గృహాలు ఇంతవరకు నిర్మాణానికి నోచుకోలేదు. 242 ఇళ్లు పునాదులకే పరిమితం కాగా, 46 ఇళ్లు గోడల వరకు, 49 ఇళ్లు మౌల్డింగ్ వరకు పూర్తయ్యాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 558 ఇళ్లు మంజూరు కాగా, కేవలం 52 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయింది.

మౌలిక వసతులూ కరువే..

జగనన్న కాలనీలన్నీ గ్రామాలకు దూరంగా ఉన్నాయి. కొన్ని కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి కొరత ఎక్కువగా ఉంది. ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి కనీసం నాలుగు లక్షలు ఖర్చవుతుందని లబ్ధిదారులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న రూ.1.7 లక్షలతో ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోగా అప్పుల పాలవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంతవరకు నిర్మాణానికి నోచుకోని స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్'



రాయచోటి: ప్రజా దర్బారులో వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఓబులవారిపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిన్నమండెం, సెప్టెంబరు 21: జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఏ ఒక్కరూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యలన్నీ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఓబులవారిపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. ప్రజా సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి ప్రసంగించారు. సర్పంచ్ ఎర్రబాబు రవిరెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి, టీడీపీ నాయకులు జనార్దన్‌నాయుడు, మండల మాజీ అధ్యక్షుడు వెంకటే శ్వర్‌రాజు, వాసుదేవరెడ్డి, కల్లా చలపతి, బొక్కసం చలపతి, కమతం నాగ రాజు, బీజేపీ నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధిత విద్యార్థులకు యువత చేయూత

చిట్వేలి, సెప్టెంబరు 21 : వరదల కారణంగా ముంపునకు గురైన పాఠశాలల విద్యార్థులకు రాజుకుంట యువత చేయూతనందించారు. ముంపునకు గురైన విజయవాడ వాంబే కాలనీలోని జెడ్‌డీఎంఎంసీ ఎలిమెంటరీ పాఠశాలలోని 450 మంది విద్యార్థులకు రూ. 65 వేల విలువైన 3300 పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు శనివారం పంపిణీ చేశారు. అదే ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ స్కూల్‌కు రూ. 5 వేల విలువైన వస్తువులను, నిర్మల శిశుభవన్‌లోని దివ్యాంగు లకు 5 వేలు అందజేశారు. దాతలకు స్కూలు యాజమాన్యం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపా రు. ఈ కార్యక్రమంలో విజయవాడలో మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్ రావు, రాజుకుంట గ్రామ యువకులు నానబాల సురేంద, పవన్, సాయికిరణ్, దిలీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న రాజుకుంట యువత



విరాళాన్ని అందజేసిన విద్యార్థులతో రీజెన్సీ సిరామిక్ ఎండీ జీఎన్ నాయుడు

నలందా విద్యార్థుల సాయం రూ.1.05 లక్షలు

రాజంపేట: వరదబాధితులకు రీజెన్సీ నలందా విద్యార్థులు 1.05 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. రీజెన్సీ నలందా విద్యాసంస్థల అధినేత, రీజెన్సీ సిరామిక్ ఎండీ డాక్టర్ జీఎన్ నాయుడు ఎదుట ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడు మాట్లాడుతూ చిన్నారులు తమ తల్లిదండ్రులు అందజేసిన ప్యాకెట్‌మనీని ఖర్చుచేయకుండా వరద బాధితులకు వెచ్చించడం స్ఫూర్తిదాయకమన్నారు. తమ సంస్థల ద్వారా సుమారు 25 లక్షల రూపాయల వరకు వరద బాధితులకు అందజేయనున్నట్లు తెలిపారు.

శ్మశానాన్ని ఆక్రమించారని కలెక్టర్‌కు ఫిర్యాదు..



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బండపల్లివాసులు

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 21: తాము శ్మశానంగా వినియోగించుకుంటున్న భూమిని కొంతమంది ఆక్రమించి ప్లాట్లు వేస్తున్నారంటూ రామాపురం మండలం, బండపల్లిగ్రామ పరిధిలోని వెంకటరెడ్డిగారిపల్లికి చెందిన ముస్లింలు శనివారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సర్వే నెంబర్ 305 లో ఉన్న దాదాపు 50 సెంట్ల భూమిని చాలా ఏళ్లుగా తాము శ్మశానంగా వినియోగించుకుంటున్నామని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేత సిద్దిగాళ్ల శ్రీనివాసులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గాలివీడు, సెప్టెంబరు 21: ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి సూచించారు. శనివారం మండలంలోని వెలిగల్లు పంచాయతీలో పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా ఆమె మాట్లాడాడు. పౌష్టికాహారం తో రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చునని, వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో సంకటహర చతుర్థి పూజలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 21: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలోని వినాయకుడి గుడిలో శనివారం సాయంత్రం సంకటహర చతుర్థి పూజలను నిర్వహించారు. అర్చకుడు మల్లికార్జునస్వామి వినాయకుడిని పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నందలూరు, సెప్టెంబరు 21 : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి స్వచ్ఛభారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, గిరిజనమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతురాజు మస్తానయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరు తమ తల్లిపేరు మీద ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఎస్సీ నాయకులు మోడపోతుల రాము, పాఠశాల కమిటీ చైర్మన్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈడిగపల్లిలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల లీడర్లు, వీవోలు, డీఆర్డీఏ సిబ్బంది ర్యాలీ చేశారు. ఏపీఎం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కృష్ణయ్య, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: స్వచ్ఛతా హి సేవపై పుల్లంపేటలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఏవో హబీబుల్లాఖాన్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పారిశుధ్య కార్మికులు శనివారం ర్యాలీ నిర్వహించారు.పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. అనంతరం పారిశుధ్య పనులు చేశారు. కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి మేనేజర్ శశికళ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు ఖురాన్ షరీఫ్ పంపిణీ



విద్యార్థులకు మిఠాయిలు, ఖురాన్ షరీఫ్‌లను పంపిణీ చేస్తున్న మైనార్టీ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 21: మహమ్మద్‌ప్రవక్త జన్మదినం సందర్భంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దఫేదార్‌పల్లి ఉర్దూ పాఠశాలలో నాతే షరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన్ మహబూబ్‌ఖాన్ బాషా ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ మిఠాయిలు, పవిత్ర ఖురాన్ షరీఫ్‌లను అందజేసి మహమ్మద్ ప్రవక్త విశిష్ట సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు సల్లావుద్దీన్ ఖాన్, మైనార్టీ నాయకుడు ఖాదర్‌హుస్సేన్, 4వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఖాదర్‌బాషా, మైనార్టీ నేతలు అస్రఫ్, నజీర్, షాహుల్‌హమీద్, హఫీజ్, ఇంథాదుల్లా, హఫీ జుల్లా, ఇమ్రాన్‌ఖాన్, మస్తాన్, రహీం, మహబూబ్‌బాషా, సగీర్, జావిద్‌హుస్సేన్, ప్రధానో పాధ్యాయుడు షౌకత్‌అలీ, ఉపాధ్యాయులు శిబక్‌తుల్లా, విద్యాకమిటీ సభ్యులు సిరతున్నబీ తదితరులు పాల్గొన్నారు.

రేపు దంత వైద్య శిబిరం

సుండుపల్లె, సెప్టెంబరు 21: మండల కేంద్రానికి సమీపంలోని గుల్లావాండ్లపల్లె, వెంగమరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలతోపాటు, గుల్లావాండ్లపల్లె అంగన్వాడీ కేంద్రంలో దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు శరత్‌గిరిరెడ్డి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. తన తల్లి సుండుపల్లె మాజీ సర్పంచ్ నిర్మలమ్మ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పనిసరి

సంబేపల్లె, సెప్టెంబరు 21: ఖరీఫ్ సీజన్‌లో పంటసాగు చేసిన ప్రతి రైతు పంట వివరాల నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. శనివారం సంబేపల్లె వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారులు, రైతులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ లోగా వేరుశనగ, టమోటా, వరి తదితర పంటల వివరాల నమోదు, ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈకేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే బీమా, సబ్సిడీ వంటి సౌకర్యాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీలత, మండల వ్యవ సాయ అధికారి కిశోర్‌నాయక్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 21: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి సూచించారు. శనివారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా సమాజంలో కలసి మెలసి జీవించే విధంగా సహకరించాలన్నారు. బాధితులకు ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, టోల్‌ఫ్రీ నెంబరు 1097 తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రజా సంక్షేమమే టీడీపీ లక్ష్యం



ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ప్రదర్శిస్తున్న సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు

గాలివీడు, సెప్టెంబరు 21: ప్రజా సంక్షేమమే టీడీపీ లక్ష్యమని మాజీ సర్పంచ్ ప్రభాకర్ నాయుడు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం ఎగువగొట్టివీడు పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం పేరుతో వంద రోజుల్లో చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. త్వరలోనే ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తారన్నారు. అనంతరం వంద రోజుల్లో చేసిన కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు. సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్‌నాయుడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో రేపు 'ఇది మంచి ప్రభుత్వం '

పుల్లంపేట: స్థానిక బైపాస్ రోడ్డులోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ముక్కా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొంటున్నందున మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వెంకటేశ్వరాలయానికి బీరువా, హుండీ వితరణ



బీరువా, హుండీ అందజేస్తున్న భక్తులు

గాలివీడు, సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో ఉన్న వెంకటేశ్వరాలయానికి కేడెం వీరారెడ్డి, మంత్రి రెడ్డికళ వారి తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, ఆదినారాయణల జ్ఞాపకార్థం వంద కేజీల బరువు కలిగిన బీరువాను, హుండీని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయంలో అవసరమైన వస్తువులను దాతల సహకారంతో ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థికంగా సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, వీరారెడ్డి, రేవనూరి రాజ్‌కుమార్, రాజేశ్, ఆదినారాయణ, రమేశ్, రామాంజులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ సభ్యులు

గాలివీడు, సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ సభ్యుడు, జిల్లా స్టాటిస్టికల్ అధికారి ఓబుల్‌రెడ్డి, డీపీవో మునీశ్వర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య ఉపకేంద్రంలో అందిస్తున్న సేవల వివరాలను ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం వివరాలను తెలియజేశారు. అనంతరం స్థానిక ఉర్దూ పాఠశాలలో 30 మంది బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బలరాంరాజు, పీహెచ్ఎన్ సాలమ్మ, ఎంఎల్‌పీహెచ్ షాహినా, ఏఎన్ఎం సుశీల, ఆశ కార్యకర్తలు సుప్రజ, పరమేశ్వరి, సుల్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

24న విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాల శిబిరం

రైల్వేకోడూరు, సెప్టెంబరు 21: ఈ నెల 24న విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాల కోసం శిబిరాలు నిర్వహించనున్నట్లు శనివారం విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో నిర్వహిస్తున్న ఈ శిబిరాలకు హాజరయ్యే విభిన్న ప్రతిభావంతులు ఆధార్‌కార్డు, యూడీఐడీ కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని కోరారు. యూడీఐడీ కార్డు తప్పని సరి అన్నారు. శిబిరాల వద్దే ఆన్‌లైన్ చేసి, నెలరోజులకు పరికరాలను పంపిణీ చేస్తారని తెలిపారు.

'క్షేత్ర పర్యటనతో విజ్ఞానానికి పునాది'

పుల్లంపేట, సెప్టెంబరు 21: క్షేత్ర పర్యటనతో విద్యార్థుల్లో విజ్ఞానానికి పునాదులు వేయవచ్చునని సైన్స్ ఉపాధ్యాయుడు రమణ తెలిపారు. వ్యవసాయ పార్టీ బోధనలో భాగంగా దళవాయిపల్లె పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు రమణ విద్యార్థులను సమీపంలోని పంట పొలాల వద్దకు తీసుకెళ్లారు. పంట పండించి దాని ద్వారా వచ్చిన ఫలితాన్ని పొందేందుకు రైతు ఎలా కష్టపడతాడు, డ్రిప్ సిస్టమ్ ద్వారా నీటిపారుదల, సేంద్రియ ఎరువులు, వాటి వినియోగం, కంపోస్టు, వర్మీ కంపోస్టు, తల్లివేరు వ్యవస్థ, పీచు వేరు వ్యవస్థ, పుష్పంలోని భాగాలు తదితరాలను వివరించారు.

నెయ్యి కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రామాపురం, సెప్టెంబరు 21: తిరుమల మహాప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక హరిహరాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ తిరుమల లడ్డు ప్రసాదం కల్తీ బాధాకరమైన విషయమన్నారు. భజ రంగ్‌దళ్ సంయోజక్ కొవ్వూరు వీరారెడ్డి, లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి దామోదర్‌నాయుడు, విశ్వహిందూ పరిషత్ మండల అర్చక ప్రముఖ్ నాగరాజు డిమాండ్ చేశారు.

'లంపీస్కిన్' పై అవగాహన అవసరం

రామాపురం, సెప్టెంబరు 21: లంపీస్కిన్ వ్యాధిపై ఆవుల యజమానులు అవగాహన పెంచుకోవాలని పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురం ప్రాంతాల్లో పశువులను ఆశించే వ్యాధులపై శనివారం ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులను శుభ్రంగా ఉంచుకొని, దోమలు కుట్టకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అత్యవసరంగా చికిత్స అవసరమైనపుడు 1962 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి పశువులను కాపాడుకోవచ్చునన్నారు. మండలానికి గాలికుంటు నివారణ టీకాలు 11,600 డోసులు వచ్చాయన్నారు. రైతు రేఖం నారాయణ, రాజు, శ్రీను, సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలపై విచారణ

సుండుపల్లె, సెప్టెంబరు21: సుండుపల్లె మండల కేంద్రంలో నెల రోజుల వ్యవధిలో జరిగిన చోరీల్లో నిందితులను పట్టుకునేందుకు ఉన్నతాధికారులు ఎస్ఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ టీంను నియమించారు. దీంతో శనివారం ఆయన చోరీలు జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాసులతో వివరాలు ఆరాతీశారు.

దేవుడితో చంద్రబాబు రాజకీయం : రోజా

నగరి, సెప్టెంబరు 21 : దేవుడితో రాజకీయం చేసే ఘనుడు చంద్రబాబు అని వైసీపీ అధికార ప్రతినిధి రోజా శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శ్రీవారి ప్రసాదం గురించి తన మాటలు భక్తుల మనోభావాలను ఎంత దెబ్బతీస్తాయో ఆయన ఆలోచించక పోవడం శోచనీయమన్నారు.తన వందరోజుల పాలనలో ఏ హామీ నెరవేర్చక ప్రజల దృష్టిని మార్చడానికి తిరుమల లడ్డూల అంశాన్ని రాజకీయం చేస్తున్నారన్నారు.

చిత్తూరు- తచ్చూరు బైపాస్‌కి సర్వీసు రోడ్డుకోసం..!

నేడు సీపీఐ నారాయణ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం

నగరి, సెప్టెంబరు 21: చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వంటావార్పు చేపట్టనున్నారు. ఈ మేరకు నగరి నియోజకవర్గ సీపీఐ ప్రదాన కార్యదర్శి కోదండయ్య తెలిపారు. నిండ్ర మండలం పాదిరి, నగరి మండలం అయనంబాకం గ్రామాల రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి


శాంతకుమారి (ఫైల్ ఫొటో)

నిండ్ర, సెప్టెంబరు 21: పాముకాటుతో ఎస్.శాంతకుమారి(42) మృతి చెందారు. ఈ సంఘటన నిండ్ర మండలం ఎలకాటూరు పంచాయతీ మిట్టూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. భర్త మృతి చెందడంతో ఇద్దరు పిల్లల పోషణకోసం శాంతకుమారి పశువులను మేపుతోంది. రోజులాగానే శుక్రవారం కూడా పశువులను గ్రామ సమీపంలో పంటపొలాల వద్ద మేపుకుని తిరిగి వస్తుండగా పాము కాటు వేసింది. ఇంటికి వచ్చాక స్పృహ కోల్పోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు కుప్పానికి మంత్రి నిమ్మల రాక

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 11 గంటలకు మంత్రి కుప్పం బ్రాంచ్‌కెనాల్ టేకాఫ్ పాయింట్, కే-1 పంపింగ్ హౌస్‌లను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం చేరుకుని అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 4.50 గంటలకు కుప్పం రైల్వే స్టేషన్ చేరుకుని ట్రైన్‌లో విజయవాడకు బయల్దేరి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిండ్రలో 68.8 మి.మీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 10 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా నిండ్రలో 68.8 మి.మీ., అత్యల్పంగా పూతలపట్టులో 1.2 మిమీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. నగరిలో 31.2, విజయపురంలో 28.4, వెదురుకుప్పంలో 22.2, కార్వేటినగరంలో 19.4, పెనుమూరులో 4.2, పాలసముద్రంలో 3.4, శ్రీరంగరాజపురంలో 2.6, రొంపిచెర్లలో 1.4 మి.మీ వర్షం కురిసింది.

హిందువుల మనోభావాలు దెబ్బతీసిన జగన్


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 21: కోట్లాదిమంది హిందువుల మనోభావాలను మాజీ సీఎం జగన్ దెబ్బతీశారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. హిందువులంతా భక్తి శ్రద్ధలతో కొలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన ఆనాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డిలను వెంటనే అరెస్టుచేసి సీబీఐతో మరింత లోతైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం జగన్ ఓట్లకోసం మాత్రమే తిరుమలకు వచ్చారని, ఆయనకు హిందూ మతంపైన ద్వేషం ఉందని మరోసారి రుజువైందన్నారు. బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో లడ్డూ నాణ్యతపై ఎమ్మెల్యే పరిశీలన


లడ్డూ నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారం నేపథ్యంలో కాణిపాకంలోని పోటులో లడ్డూ నాణ్యతను శనివారం రాత్రి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పరిశీలించారు. నాణ్యతలో ఏమాత్రం తేడా రాకూడదని పోటు సిబ్బందిని హెచ్చరించారు. భక్తులు ఎవరైనా లడ్డూ రుచిపై ఫిర్యాదు చేస్తే ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. అలాగే ప్రస్తుతం వాడుతున్న నెయ్యిని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ టెస్ట్‌కు పంపాలని ఆదేశించారు. ఆలయ ఈవో గురుప్రసాద్, మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, ఈవో సీసీ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు బదిలీ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, సెప్టెంబరు 21: జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో 175 మంది కానిస్టేబుళ్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న, వీఆర్‌లో ఉన్న 14 మంది ఏఎస్ఐలు, 59 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 102 కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ జరిగింది. వారు కోరుకున్న ప్రకారం ఖాళీలను అనుసరించి పోలీసుస్టేషన్ ఆప్షన్‌ను కేటాయించారు. ఏవో మోహన్‌రావు, డీపీవో, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి



తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం శ్రీకాళహస్తి ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్ తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పుత్తూరులో పెట్రోలు బంకు ఏర్పాటుకు సంబంధించి ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న శీను అనే వ్యక్తిని లంచం పేరిట వేధించారన్న ఆరోపణలపై తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న ఆ పోస్టులో ప్రభుత్వం రెగ్యులర్ ఆర్డీవోను నియమించే వరకూ శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.



జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు - నిలిచిపోయిన వాహనాలు

ఇంట్లో ఏ వస్తువు ముట్టుకున్నా షాక్ కొడుతోంది!

- గ్రామంలో ఇద్దరు చనిపోయినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోరా?
- జాతీయ రహదారిపై బైఠాయించి గుడ్లకట్టమంచి దళితుల నిరసన
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 21: 'మా ఇళ్లలో ఏ వస్తువు ముట్టుకున్నా షాక్ కొడుతోంది. గురువారం రాత్రి కూడా మా గ్రామంలో తాతామనవడు ఊయలలో ఊగుతుండగా విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందారు. అయినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోలేదు' అంటూ బంగారుపాళ్యం మండలంలోని గుండ్లకట్టమంచి దళితులు శనివారం రాత్రి చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించారు. ఒక్కసారిగా వంద మందికిపైగా రోడ్డుపై బైఠాయించి, నిరసనకు దిగడంతో రెండువైపులా కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు స్తంభించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఇంట్లోనూ ఏ వస్తువును ముట్టుకున్నా షాక్ కొట్టడంతో సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపేశామన్నారు. ఇద్దరు చనిపోయినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోక పోవడం సరికాదన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కదిలేదని లేదని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పి.. ధర్నాను విరమింపచేశారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈ హరి, ఏడీఈ కొండయ్యలు గ్రామానికి చేరుకున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే పనులు మొదలు పెట్టారు.




స్వర్ణ తాపడ తోరణం, పూజాసామగ్రి అందజేస్తున్న దాతలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి - స్వర్ణ తాపడం చేసిన శనీశ్వరస్వామి సన్నిధానం

స్వర్ణమయం.. శనీశ్వర సన్నిధానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: ముక్కంటి ఆలయంలోని శనీశ్వరస్వామి సన్నిధానం స్వర్ణమయమైంది. హైదరాబాదుకు చెందిన వ్యాపారవేత్తలు మనోజ్, మహేష్‌రెడ్డి సొంత నిధులతో స్వర్ణతాపడం పనులు చేయించారు. స్వర్ణమయమైన తర్వాత తొలిసారి పూజలను శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా దాతలు స్వామివారికి అలంకరించే పీఠం, తోరణంతో పాటు వివిధ స్వర్ణతాపడంతో తయారు చేసిన పూజా సామగ్రిని అందజేశారు. అర్చకులు సన్నిధిని శుద్ధిచేసిన అనంతరం సంకల్ప పూజలతో శనీశ్వరమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. వారు జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి పది నెలల బాలుడి మృతి

పుంగనూరు పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల నిరసన



అమ్మమ్మతో సాత్విక్‌నందన్ (ఫైల్‌ఫొటో) - పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

పుంగనూరు, సెప్టెంబరు 21: పుంగనూరులో వైద్యం వికటించి పదినెలల బాలుడి మృతి చెందడంతో బాధిత కుటుంబీకులు శనివారం రాత్రి న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల కథనం మేరకు...పెద్దపంజాణి మండలం మాదాండ్లపల్లెకు చెందిన ఓ.బాలసుబ్రహ్మణ్యం పుంగనూరు తూర్పు మొగసాల అర్బన్ హెల్త్‌సెంటర్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బాలసుబ్రహ్మణ్యం, ఆయన భార్య వెన్నెల, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి స్థానిక నక్కబండలో కాపురం ఉన్నారు. అతడి భార్య, కుమార్తె, కుమారుడికి పదిరోజులుగా జ్వరం వస్తోంది. కుమారుడు సాత్విక్‌నందన్ (10 నెలలు)కు దగ్గు, జ్వరం, జలుబు ఉండగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కార్తీక్ చిన్నపిల్లల ఆసుపత్రిలో డాక్టర్ కార్తీక్ రాజ్ వద్ద వైద్యం చేయించారు. సిరప్, మాత్రలు ఇచ్చినా బాలుడికి జ్వరం తగ్గకపోవడంతో మదనపల్లెకు వెళ్లాలని ఆ డాక్టర్ సూచించారు. సాత్విక్ నందన్‌కు తీసుకుని శనివారం సాయంత్రం మదనపల్లె ఆసుపత్రికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకుని కుటుంబీకులు కార్తీక్ ఆసుపత్రికి వచ్చి గొడవ చేశారు. నీ వల్లే వైద్యం వికటించి తమ బిడ్డ చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన ఆసుపత్రి మూసేసి వెళ్లాడు. బాధితులు పుంగనూరు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ తమ బిడ్డ మృతికి డాక్టర్ కార్తీక్ కారణమని, వెంటనే డాక్టర్‌ను అరెస్టు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పుంగనూరు సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మీకు న్యాయం చేస్తామని సర్దిచెప్పి బాలుడి మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటితో ముగియనున్న బదిలీల గడువు

- రాజకీయ సిఫార్సులతో జిల్లా యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21: ఉద్యోగుల బదిలీలకు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తొలి విడతగా బదిలీల జాబితాను తయారు చేసింది. విద్య, వైద్య, వ్యవసాయ అనుబంధ శాఖల్లో మినహా మిగిలిన 15 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. వాస్తవానికి ఈనెల 15వ తేదీకల్లా ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగిసింది. అయితే భారీ వర్షాలు, వరదల కారణంగా ఉద్యోగులంతా విజయవాడ తరలి వెళ్లడంతో బదిలీలను వాయిదా వేసింది. చివరికి ఆదివారం నాటికి బదిలీల ప్రక్రియకు తుది గడువు ప్రకటించింది. ఈ క్రమంలో సిఫారసు లేఖలతో అధికారులపై ఒత్తిడి చేస్తూ కోరుకున్న చోటు దక్కించుకునేందుకు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లాపరిషత్, డీఆర్‌డీఏ, డ్వామా, ఇంజనీరింగ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం తమదైన శైలిలో పైరవీలు ప్రారంభించారు. శనివారం రాత్రి పొద్దుపోయే వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల బదిలీల ప్రక్రియపై అధికారులు కసరత్తు చేశారు. జిల్లాలో 34 మండలాలకు సంబంధించి వీఆర్వో, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల జాబితా సిద్ధమైంది. ఆదివారం సాయంత్రానికల్లా రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు అధికారికంగా వెలువడనున్నాయి. గ్రేడ్ 1, గ్రేడ్2, గ్రేడ్3, గ్రేడ్4 పంచాయతీ కార్యదర్శులకు వారి సీనియార్టీని బట్టి 450 పంచాయతీలకు పైగా నూతన పోస్టింగ్ ఇవ్వనున్నారు. చంద్రగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లో మేజర్ పంచాయతీ కార్యదర్శి పోస్టులకు విపరీతమైన పోటీ నెలకొంది. 'మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల నుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో వచ్చిన ఆర్డీవోలు (ఎస్‌డీసీ) సైతం ఇప్పటికీ జిల్లాలో కొనసాగుతున్నారు. వారి బదిలీలు కూడా ఆదివారం నాటికి రానున్నాయి. మిగిలిన శాఖల్లో కూడా బదిలీల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన ఈ బదిలీలు జరుగనున్నాయి.

పొదుపు మహిళలకు త్వరగా రుణాలు


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్డీఎం హరీష్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎల్డీఎం హరీష్ ప్రారంభించి, ప్రసంగించారు. మహిళలు వ్యాపారంలో రాణించడానికి అవసరమైన ముద్ర, ఫుడ్ ప్రాసెసింగ్ లోన్స్ అందిస్తామన్నారు. పొదుపు సంఘాల్లోని మహిళలకైతే త్వరగా రుణసౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమ శాఖ ద్వారా విద్యుత్ సబ్సిడీ, పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనుమతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిక్షణ పొందిన వారికి కలెక్టర్ అనుమతితో రుణ సహకారం అందిస్తామని చెప్పారు. ఐఎల్వో మాస్టర్ ట్రైనర్ ధనుంజయ మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నటువంటి వ్యాపార అవకాశాలను తెలియజేశారు. 30 మంది ఔత్సాహిక మహిళలు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'ఆకుపేను'తో కొబ్బరి రైతు విలవిల!



కుప్పం, సెప్టెంబరు 21: కొబ్బరి తోటలను ఆశిస్తున్న ఆకు కొరుకుడు పేను రోగంతో రైతులు విలవిలాడుతున్నారు. నివారణోపాయం తెలియక, రోగం ఉపశమించే మార్గం కానరాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఉద్యాన శాఖ ద్వారా అందాల్సిన సలహాలు, సూచనలు వారికి అందడంలేదు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ కొబ్బరి తోటలు నిలువునా ఎండిపోయినట్లు కనిపిస్తున్నాయి. పచ్చగా ఉండాల్సిన కొబ్బరి ఆకుల మట్టలు అగ్గి పెట్టినట్లు బూడిద రంగుకు మారిపోయాయి. చాలాచోట్ల కొబ్బరి దిగుబడి తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాల్లో కొబ్బరి కాయలు వస్తున్నాయి కానీ వాటి పరిమాణం, నాణ్యత దిగనాసిల్లిపోయింది. కుప్పం మండలంలోని పెద్దబంగారునత్తం, వానగుట్టపల్లె, కృష్ణదాసనపల్లె, మల్లానూరు తదితర గ్రామాలన్నింటిలో ఎక్కడా కొబ్బరి తోటల్లో కాపు కనిపించడంలేదు. గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి కారణం కొబ్బరి తోటలను ఆకు తినే పేను రోగం ఆశించడమేనని రైతులు చెబుతున్నారు. ఈ రోగం సోకిన కొబ్బరి చెట్టు ఆకులు పూర్తిగా ఎండిపోతాయి. దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. నాణ్యత ఉండదు. సాధారణంగా రైతులు ఒక కాయ రూ.10 వంతున హోల్‌సేల్‌గా తోటమీదనే వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ఈ కొబ్బరి కాయను ఒకటి రూ.20 నుంచి రూ.35 దాకా రిటైల్ దుకాణాల్లో అమ్ముతుంటారు. కానీ దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు నష్టాల బాట పట్టారు. వచ్చిన కాపులో కూడా కాయ పరిమాణం, నాణ్యత తగ్గిపోవడంతో ధర పలకడం లేదు. అంతేకాదు, ఆకు తినే పేను రోగం వచ్చిన చెట్టు కాయ నీళ్లు తాగరాదని రైతులు అంటున్నారు. అయితే నియోజకవర్గంలో ఎటుచూసినా కొబ్బరి తోటలు రోగానికి గురి అవుతున్నా, ఉద్యాన శాఖాధికారులు తమవైపు తొంగి చూడడంలేదని రైతులు వాపోతున్నారు. ఆకు కొరికే పేను రోగం తగ్గడానికి, నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చి రైతులను కష్టనష్టాలనుంచి బయట పడేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

తిరుమల పవిత్రతను నవ్వుల పాలు చేస్తారా?



బంగారుపాళ్యం, సెప్టెంబరు 21: తిరుమల పవిత్రతను నవ్వులపాలు చేశారంటూ శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు మూడు నామాలు పెట్టుకుని ర్యాలీ నిర్వహించారు. లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీ ధరణీప్రసాద్ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, జనార్దన్ గౌడ్, రమేష్, నాగరాజ గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, కుప్పాల మురళి, జాకీర్ హుస్సేన్, రాధాకృష్ణమ నాయుడు, కృష్ణకుమారి, కవి, కొండేటి శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై బీజేపీ ఫిర్యాదు



ఐరాల, సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై ఐరాల ఎస్ఐ నరసింహులుకు మండల బీజేపీ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. నాయకులు రాజేష్‌రెడ్డి, పెరుమాళ్లసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ చర్యకు పాల్పడిన మాజీ సీఎం జగన్, పూర్వపు ఈవో ధర్మారెడ్డి, పాలక మండలి మాజీ అధ్యక్షుడు వైవీ.సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేయాలని విన్నవించారు. ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ పెద్దరెడ్డెప్ప, రమణాచారి, బషీర్, సుధాకర్, శీను తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 21: విజయవాడ వరద బాధితులకు మదనపల్లె తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో రూ.1,11,111 విరాళాన్ని అందజేశారు. శనివారం తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మోడెం సిద్ధప్ప, నీలకంఠ, ఉప్పు రామచంద్ర, పురాణం చంద్రశేఖర్, కేవీ నాగరాజు, బండి పవన్‌కుమార్, రత్నమయ్య పాల్గొన్నారు.

పీలేరు వైద్యుల వితరణ

పీలేరు, సెప్టెంబరు 21: రాష్ట్రంలోని వరద బాధితుల కోసం పీలేరులోని వైద్యులు తమవంతు సాయంగా రూ.87,500లు అందించారు. ఐఎంఏ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు పీలేరు పట్టణంలోని 35 మంది వైద్యులు ఒక్కొక్కరు రూ.2500లు చొప్పున రూ.87,500లు జమ చేసి చెక్కు రూపంలో శనివారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్షులు డా.చంద్రశేఖర్, కార్యదర్శి డా.పవన్ కుమార్, కోశాధికారి డా.ఈశ్వర సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి


మృతి చెంది పడి ఉన్న జింక మృత కళేబరం

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 21: వీధికుక్కల దాడిలో ఓ జింక గాయపడి మృతి చెందిన సంఘటన పీటీఎం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక రైతులు అందించిన సమాచారం మేరకు... ఎంపీడీవో కార్యాలయానికి కూతవేటు దూరంలో పీటీఎంకు చెందిన రైతు రఘు తన పొలం వద్దకు వెళుతుండగా అటు వైపు నుంచి వీధి కుక్కలు ఓ జింకపై ముకుమ్మడిగా దాడి చేశాయి. అప్పటికే జింకకు తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన రైతు పరుగున వెళ్లి కుక్కల బారి నుంచి కాపాడి స్థానిక పోలీసులకు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. వారు ఎంత సేపటికి రాకపోవడంతో జింక మృతి చెందింది. అనంతరం ఆటోలో మెలకలచెరువుకు తరలించి ఫారెస్ట్ అధికారులకు అప్పచెప్పారు.

రేపు మెగా జాబ్‌మేళా

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 21: నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మదనపల్లెలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 30 దాకా బహుళజాతి సంస్థల ప్రతినిధులు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో 23న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా జాబ్‌మేళాకు హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.

29న హైకోర్టు జడ్జి రాక

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 21: ఉమ్మడి చిత్తూరు జిల్లా పోర్టుపోలియో హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్ మదనపల్లె పర్యటన ఖరారైంది. ఈ క్రమంలో శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని రెండవ అదనపు జిల్లా జడ్జి బి.అబ్రహం పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్టులో వివిధశాఖల అధికారులతో సెకండ్ ఏడీజే సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కోర్టు భవనంపై మొదటి అంతస్తులో నిర్మించిన నూతన భవనం ప్రారంభించడానికి ఆయన హాజరు కానున్నారన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శిరీష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి విశేష పూజలు

కలకడ, సెప్టెంబరు 21: మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అనంతరం నైవేద్యం సమర్పించి అభిషేకం, ఆకు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

శాంతితోనే దేశాల అభివృద్ధి

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 21: ప్రపంచ దేశాల మధ్య, శాంతి, సౌభ్రాతృత్వం వుంటేనే అన్ని దేశాలు అభివృద్ధి దిశగా నడుస్తాయని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. అలాగే విద్యార్థినులతో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామజ్యోతి సంస్థ అధ్యక్షురాలు సుభద్ర, అధ్యాపకులు వనజ, జ్యోతి, శ్రీనివాసులు, సూర్యశేఖర్‌రెడ్డి, గురుమూర్తి, వెంకటశివ, యాస్మిన్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ధ్యేయం : నల్లారి కిశోర్




పీలేరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి, టీడీపీ శ్రేణులు, ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పోస్టరును ఆవిష్కరిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి, కూటమి నేతలు

పీలేరు, సెప్టెంబరు 21: రోజుకో సంక్షోభం వెంటాడుతున్నా ఏమాత్రం వెరవకుండా ప్రజాసేవే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం-ప్రజావేదిక' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పాపాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలూ కుప్పకూలిపోయి సంక్షోభాలు ఏర్పడుతున్నా భయపడకుండా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకునే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన 'ఇది మంచి ప్రభుత్వం' ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లెటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అవుతోంది. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం ప్రజలు అందించిన సంక్షేమ పథకాలు, నూతన విధానాలు, పరిపాలన గురించి వివరించేందుకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. శనివారం పట్టణంలోని దేవళం వీధిలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ విధానాలను, పరిపాలనను వివరిస్తూ ఆ ఇంటికి స్వయంగా స్టిక్కర్లు అతికించారు. అనంతరం దేవళం వీధి ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకు ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిపై అక్కడే వున్న సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, గుర్రప్పనాయుడు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం మండలంలోని కోటాలలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జుంజురపెంట పెద్దేరు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు కాలువలు, సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన పార్కు, తుపాను వర్షాలకు కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవో త్యాగరాజు, మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీను పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

● ఒకరు అరెస్టు, ఇద్దరు పరార్ ● ఎక్సకవేటర్ స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్సకవేటర్

కలకడ, సెప్టెంబరు 21: మండలంలోని నవాబ్‌పేట చెరువు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని నవాబ్‌పేట చెరువు ఇరిగేషన్ చెరువు. ఈ చెరువులో ఇసుక నిల్వలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొంత కాలంగా కొందరు నాయకులు, ఇసుకాసురులతో జతకట్టి ప్రతి రోజు ఎక్సకవేటర్ సాయంతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో నవాబ్‌పేట చెరువులో అక్రమంగా ఇసుకను తవ్వుతున్నట్లు శనివారం పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చెరువులో అక్రమంగా ఇసుక తవ్వుతున్న ఎక్సకవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే యాజమాని వరుణ్‌ను కూడా అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పోలీసులను చూసి డ్రైవర్ పుల్లయ్య, ట్రాక్టర్ యజమాని పద్మనాభనాయుడులు పరారైనట్లు తెలిపారు. వీరిద్దరిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే

పెద్దమండ్యం, సెప్టెంబరు 21: విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమేనని పెద్దమండ్యం ఎంఈవో మనోహర్ పేర్కొన్నారు. మండలంలోని కలిచెర్లలో మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికలకు ఆటల పోటీలు జరిగాయి. పెద్దమండ్యం మోడల్ స్కూల్, జడ్పీ హైస్కూల్, కలిచెర్ల తెలుగు, ఉర్దూ, యల్లంవారిపల్లి, వెలిగల్లు హైస్కూల్ బాల బాలికలు మధ్య కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు జరిగాయి. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన టీమ్‌లు నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్నిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, రామచంద్ర, అమీన్, రజనీ, గాజుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన ప్రసాదం అందించండి'

వాల్మీకిపురం, సెప్టెంబరు 21: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో నాణ్యమైన లడ్డూను అందించాలని చింతపర్తి గ్రామ ప్రజలు కోరారు. లడ్డూ తయారీలో కలుపుతున్న నెయ్యిలో కల్తీ జరిగినట్లు ఎంక్వైరీలో తేలినందుకు నిరసన తెలిపారు. ఈ మేరకు శనివారం వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామ పంచాయతీలో గంగరాయి వద్ద చింతపర్తి గ్రామ ప్రజలు, పెద్దల సమక్షంలో వెంకటేశ్వరస్వామి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ జమీర్, లంకిపల్లె జయ, మహేష్ కాకర్ల, ద్వారకనాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, కోటపల్లి బాబురెడ్డి, ఎస్‌ఆర్ శీనా, మధు తదితరులు పాల్గొన్నారు.

హిందూ పరిరక్షణ సమితి నిరసన

రామసముద్రం, సెప్టెంబరు 21: గత ప్రభుత్వ పాలనా సమయంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించడం హిందూ ధర్మాన్ని, హిందువుల మనోభావాలను అవమానించడమే కాక చట్టరీత్యా నేరమని హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చెంబకూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఇంజం ఆనందకుమార్‌నాయుడు, కృష్ణమూర్తి, శ్రీనివాస మోదీ, రామ్మూర్తి, రంగాని వెంకటేష్, శీన, రమేష్, గుర్రప్ప, గంగాధర్, టైలర్ మని, వెంకటరమణ, లక్ష్మన్న, మేస్త్రీ కిట్టన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు హార్సిలీహిల్స్‌కు మంత్రి నిమ్మల రాక

బి.కొత్తకోట, సెప్టెంబరు 21: రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు నేడు హార్సిలీహిల్స్‌కు రానున్నారు. కర్నూలు, అనంతపురం జిల్లాలలో హంద్రీ-నీవా రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల పరిశీలన, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో సమీక్ష అనంతరం సాయంత్రం ఆయన హిల్స్‌కు చేరుకుంటారు. ఈ మేరకు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ నుంచి ఆదేశాలు రావడంతో బి.కొత్తకోట రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు కిశోర్‌కుమార్‌రెడ్డి పర్యటన

కలికిరి, సెప్టెంబరు 21: మండలంలో జరుగుతున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలికిరి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఎంపీడీవో గంగయ్య తెలిపారు.

మండల సమావేశాన్ని అడ్డుకున్న కూటమి నేతలు

● మండల సర్వసభ్య సమావేశం వాయిదా


పీటీఎం ఎంపీడీవో ఆఫీసు వద్ద భారీగా మోహరించిన పోలీసులు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 21: మండల కేంద్రమైన పీటీఎంలో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకోవాలని మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కూటమి నేతలు పెద్దఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా క్షేత్రంలో ప్రజల ఓట్లతో గెలిచి ప్రజాపాలన చేయాలని కూటమి నేతలు వైసీపీ ప్రజాప్రతినిధులకు సవాల్ విసిరారు. వైసీపీ ప్రజాప్రతినిధులు ఎంతసేపటికి రాకపోవడంతో సమావేశాన్ని అధికారులు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ శ్రీనాథ్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, సింగల్ విండో మాజీ ఛైర్మన్ సంపతికోట కిట్టన్న, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, సీనియర్ టీడీపీ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముదుమూరు నవీన్, పట్టా చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థల వివాదమై ఇరువర్గాల ఘర్షణ

కురబలకోట, సెప్టెంబరు 21: ఇంటి స్థల వివాదమై ఇరువర్గాలు ఘర్షణ పడ్డ సంఘటన శనివారం మండలంలో జరిగింది. ముదివేడుకు చెందిన ఇంతియాజ్‌కు అదే గ్రామానికి చెందిన ఏజాజ్‌లకు ఇంటి స్థల విషయమై కొద్ది రోజులుగా వివాదం నెలకొంది. ఈ స్థల విషయమై ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో గాయపడిన వారిని కుటుంబీకులు 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు ఆసుపత్రికి చేరుకుని విచారించారు. కాగా ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హార్సిలీహిల్స్ చెక్‌పోస్టులో రెవెన్యూ సిబ్బంది


హార్సిలీహిల్స్ దిగువన టోల్ వసూలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బి.కొత్తకోట, సెప్టెంబరు 21: పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వెళ్లే మార్గంలో దిగువన కోటావూరు వద్ద గల చెక్‌పోస్టులో వాహనాల రుసుంను రెవెన్యూ అధికారులు వసూలు చేస్తున్నారు. ఈ రుసుం వసూలు చేసే హక్కు కోసం టౌన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహిస్తారు. ఏడాది క్రితం నిర్వహించిన వేలంపాటలో దీని ధర రూ.24లక్షలు పలికింది. ప్రస్తుతం ఆ గడువు ముగిసింది. తదుపరి వేలం ఈ నెల 30న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించాలని టౌన్‌షిప్ కమిటీ ఛైర్మన్ టెండరు ప్రకటన చేశారు. దీంతో 3రోజులుగా హిల్స్‌పైకి వెళ్లే వాహనదారుల నుంచి ద్విచక్ర వాహనానికి రూ.30, కారు, జీపులకు రూ.100, మినీ బస్సులకు రూ.170 ప్రకారం రెవెన్యూ అధికారులే వసూలు చేస్తున్నారు. ఇందుకోసం ముగ్గురు వీఆర్వోలు, మరో ముగ్గురు వీఆర్ఏలకు విధులు అప్పగించారు. వీరు వంతుల వారీగా టోల్‌గేట్‌లో వసూళ్లు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని తహసీల్దార్ ఖాతాలో జమ చేయనున్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, సెప్టెంబరు 21: మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

'అల్జీమర్స్ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు'

వాల్మీకిపురం, సెప్టెంబరు 21: అల్జీమర్స్ వ్యాధి (మతిమరపు) పట్ల నిర్లక్ష్యం చేయరాదని వాల్మీకిపురం మండలం చింతపర్తి వైద్యాధికారిణి శ్రీవిద్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని మూరేవాండ్లపల్లెలో 104 సేవలలో భాగంగా మతిమరపు వ్యాధి నెమ్మదిగా మొదలై కాలం గడిచే కొద్ది తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మొహ్మద్ రఫీ, వైద్య 104 సిబ్బంది పాల్గొన్నారు.

దారుణంగా తగ్గిన వేరుశనగ దిగుబడులు


వేరుశనగ పొలంలో పంట దిగుబడులను తూకం వేస్తున్న వ్యవసాయాధికారులు

కలికిరి, సెప్టెంబరు 21: మండలంలో ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశెనగ పంట దిగుబడులు దారుణంగా వున్నాయి. జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ సమక్షంలో ఏవో మమతారెడ్డి పర్యవేక్షణలో శనివారం వేరుశనగ దిగుబడుల అంచనా కోసం శాస్త్రీయ పద్ధతుల్లో పంట నూర్పిడి చేశారు. చీకటిపల్లె గ్రామంలోని రైతు శేషారెడ్డి పొలంలో సాగుచేసిన వేరుశనగ పైరును నిర్ణీత విస్తీర్ణంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. సర్వే నెంబరు 201 పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో 1.200 కిలోల దిగుబడులు నమోదయ్యాయి. అంటే ఎకరాకు 194 కిలోలు అనగా దాదాపుగా 5 బస్తాలు మాత్రం దిగుబడులు వచ్చాయని గుర్తించారు. అదే విధంగా రెండవ ప్రయోగాన్ని అదే గ్రామంలోని సరోజమ్మకు చెందిన 214-3 సర్వే నంబరులో పరిశీలించగా నిర్ణీత విస్తీర్ణంలో 0.170 కిలోలు (కేవలం 170 గ్రాములు) నమోదు చేశారు. అంటే ఎకరాకు 28 కిలోలు మాత్రం దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. మొత్తానికి మండలంలో వేరుశెనగ పంట దిగుబడులు ఆశావహంగా లేవని అధికారులు గుర్తించారు. అనంతరం గుట్టపాలెం పంచాయతీలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా డీఏవో చంద్రానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ-కేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించి ఈ నెల 23వ తేదీ లోగా రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్కే) వద్ద రైతులు పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో మమతా రెడ్డి, ఏఈవో వి.రమేష్, ఆర్ఎస్కే సిబ్బంది నాగేశ్వరనాయక్, సతీష్, రాజేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ కార్యక్రమంలో మొక్కల పెంపకం


కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 21: మండలంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా శనివారం ముష్టూరు పంచాయతీలోని కస్తూర్బా పాఠశాల ఆవరణంలో సర్పంచ్ చెంద్రాయుడు, టీడీపీ నాయకులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లోనూ ప్రతి రోజూ ఒక కార్యక్రమాన్ని చేపట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఉపాధి హామీ ద్వారా మొక్కల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం వున్న చెట్లను నరికివేయడం వలన మానవాళి మనుగడ ప్రశ్నార్థకరంగా మారిందని తెలిపారు. ప్రతి వ్యక్తి ఒక మొక్కనైనా నాటి పర్యావరణాన్ని కాపాడితే మానవాళి జీవనం సాఫీగా సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లోకేశ్వరి, టీడీపీ నేతలు రమణ, శంకర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి : సీపీఐ

తంబళ్లపల్లె, సెప్టెంబరు 21: మండలంలోని ఇళ్లు లేని నిరుపేదలు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ నాయకుడు అంజినప్ప, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణప్ప డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొట్లపల్లె గ్రామం సర్వే నెంబరు 27/2ఏబిలో నాలుగు ఎకరాల భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎర్ర జెండాలు నాటి భూ పోరాటం ప్రారంభించారు. పేదలకు సాగు భూమితో పాటు ఇంటి స్థలాలు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, సుధీర్‌కుమార్, జయశేఖర్, ఉత్తన్న, మంత్రాల రమణ, కుప్పన్న, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి 47 మంది విద్యార్థులు ఎంపిక



కురబలకోట, సెప్టెంబరు 21: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీకి 47 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు 35వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎంపికలను నిర్వహించారు. కాగా ఈ పరీక్షలకు 100 మంది హాజరు కాగా వారికి పరుగుపందెం, లాంగ్ జంప్, హైజంప్ తదితర పరీక్షలను నిర్వహించి 27 మంది బాలురను, 20 మంది బాలికలను ఎంపిక చేశారు. ఈ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

మిట్స్‌లో ఎన్‌పీటీఈఎల్‌కు విశేష స్పందన

మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ మాట్లాడుతూ చెన్నై ఐఐటీ, ఎన్‌పీటీఈఎల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్వయం పేరుతో వివిధ రకాల సబ్జెక్టులపై జాతీయస్థాయిలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ పరీక్షలను నిర్వహించారు. కాగా ఈ పరీక్షలకు 650 మంది దరఖాస్తు చేసుకోగా 645 మంది హాజరయ్యారు. ప్రతి ఏడాది రెండు సార్లు విద్యార్థులు, అధ్యాపకులకు పరీక్షలను నిర్వహిస్తారని, ఈ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.

రేపు మాజీ సీఎం కిరణ్ కలికిరి రాక

కలికిరి, సెప్టెంబరు 21: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. నాలుగు రోజులపాటు ఆయన స్థానికంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పాల్గొంటూ అందుబాటులో వుంటారని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి విమానాశ్రయం, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 2.40 గంటలకు కలికిరి చేరుకుంటారని కృష్ణప్ప వివరించారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం శనివారం ఉదయం 10 గంటలకు కలికిరిలో బయలుదేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాదు బయలుదేరనున్నట్లు వివరించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 21: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన సంఘటన మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లె రోడ్డులో జరిగింది. అంకిశెట్టిపల్లె నుంచి అనిత (21)తో పాటు అమ్మ రెడ్డెమ్మ(60) ఒక ద్విచక్రవాహనపై, దేవళంవీధికి చెందిన సాధిక్, షీలార్ మదనపల్లె నుంచి ద్విచక్రవాహనంపై అంకిశెట్టిపల్లెకు వెళుతూ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఇందులో ముగ్గురు గాయపడ్డారు. అంకితకు కాలు విరగగా, రెడ్డెమ్మకు గాయాలయ్యాయి. సాధిక్ కూడా గాయాలయ్యాయి. కాగా తాలుకా పోలీసులు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఘనంగా గురజాడ జయంతి వేడుకలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 21: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల్లో శనివారం గురజాడ జయంతి వేడుకలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అభ్యుదయ భావజాలంతో సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయులలో గురజాడ అగ్రస్థానంలో ఉంటారని పేర్కొన్నారు. 162వ జయంతిని తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డెప్పరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ డే

పీలేరు, సెప్టెంబరు 21: వైద్య ఆరోగ్యశాఖలోని ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాల కోసం శనివారం పీలేరులో డీఎంహెచ్‌వో కొండయ్య ప్రత్యేక గ్రీవెన్స్‌డే నిర్వహించారు. పీలేరుతో పాటు పరిసర ప్రాంతాల్లోని 9 పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్లు గ్రీవెన్స్‌డేకు హాజరయ్యారు. పలువురు మాట్లాడుతూ తమకు జీతాలు పెంచాలని, యాప్‌ల భారం ఎక్కువగా ఉందని, రికార్డుల నిర్వహణ తలకు మించిన భారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎం సుగుణ, విజయ్, హెచ్ఈ ఉషారాణి, సూపర్‌వైజర్లు కుసుమ, మహమ్మద్ బాషా, ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వంద రోజుల పాలన


సంబరాలు చేసుకుంటున్న టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు

ములకలచెరువు, సెప్టెంబరు 21: ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో శనివారం కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావడంతో సంబరాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిసేకం చేసి భారీ ఎత్తున బాణాసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నక్రిష్ణా, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు ముత్తకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, చింతకుంట్ల కేశవులు, నాయకులు రామకృష్ణమరాజు, శంకర్‌నారాయణ, నారాయణస్వామినాయుడు, శివన్న, భాస్కర్‌నాయుడు, ప్రతాప్, ఉమాశంకర్, రవి, మల్లికార్జున, గాండ్ల రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.